ఆంధ్రజ్యోతి


****

ANDHRAJYOTHY

నల్లగొండ

5

సోమవారం 16 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.5
కనిష్ఠం	24.4


యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ



- 78వేల మంది భక్తుల రాక
- నిత్యాదాయం రూ.80.11లక్షలు

7

ఆధ్యాత్మికతకు ఆలవాలం



సూర్యాపేట జిల్లా అర్వపల్లి ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్నది. 12వ శతాబ్దం నుంచి చరిత్ర కలిగిన దేవాలయాలు జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో నేటికీ విరాజిల్లుతున్నాయి. గుట్టల మధ్యన దేవాలయాలు చూసేందుకు చూడముచ్చటగా ఉన్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తూ మొక్కు చెల్లించుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-అర్వపల్లి)

6

పని బంగారం.. బతుకు నిస్సారం



కులవృత్తుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో వాటిపై ఆధార పడి న వారు బతుకు దారి మార్చుకుంటున్నారు. మరికొందరు ఇప్పటికీ తాతల కాలం నుంచి వారసత్వం గా స్వీకరించి స్వర్ణకార వృత్తినే నమ్ముకుంటూ నానా యాతన పడుతున్నారు. పని బంగారం.. కాని బతుకే నిస్సారంగా మారిందని స్వర్ణకారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి- రామగిరి)

6

ఉద్యాన విద్య.. ఉజ్వల భవిత



ఏటా వాతావరణంలో కలుగుతున్న అసమతుల్యత కారణంగా తక్కువ నీటి వనరుల వినియోగంతో పంటల సాగుపై రైతులు దృష్టిసారిస్తున్నారు. అందులో ఉద్యాన పంటలు ముందు వరుసలో ఉంటున్నాయి. ఈ రంగంలో ఉపాధి అవకాశాలూ పెరుగుతుండటంతో యువత కోసం ప్రభుత్వం రెండేళ్ల డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టింది.

7

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ వ్యవసాయం)

నేడు రైతులతో సీఎం ముఖాముఖి

వీడియో కాన్ఫరెన్స్‌కు రైతువేదికల్లో ఏర్పాట్లు



నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం రైతువేదికలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఈవో విజయలక్ష్మి

నల్లగొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. 16న మధ్యాహ్నం క్యాబినెట్ సమావేశం అనంతరం సాయంత్రం 3గంటలకు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడనున్నారు. అందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 72 రైతు వేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ సామగ్రి అమర్చగా, తాజా మరో 142 రైతు వేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ అందుబాటులోకి వచ్చింది. ఈ వీడియోకాన్ఫరెన్స్ వ్యవస్థ ద్వారా రైతులకు రైతు నేస్తం' కార్యక్రమాలు ప్రసారం కానున్నాయి. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సాగులో నూతన యాజమాన్య విధానాలు, ఆధునిక సాంకేతికత, యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. కాగా, సీఎం ముఖాముఖికి ఒక్కో రైతు వేదికలో 250 మం ది రైతులకు తగ్గకుండా పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా ఒక్కో రైతు వేదికలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాస్థాయి, డివిజన్‌స్థాయి, మండలస్థాయి అధికారులు సైతం హాజరుకానున్నారు. నల్లగొండ జిల్లాలోని చింతపల్లి మండలంలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరవుతారని జేడీఏ శ్రవణ్‌కుమార్ తెలిపారు. వీసీలు ఉన్న రైతు వేదికల వద్దకు రైతులు సకాలంలో చేరుకొని ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షించాలని ఆయన కోరారు.

అన్నదాతలకు తీపి కబురు!

వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రైతులకు తీపి కబురు చెప్పే అవకాశాలు ఉన్నాయి. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ రానుండటం, పల్లెలతో ముడిపడి ఉన్న ఎన్నికలు కావడంతో రైతుభరోసాను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈనెల 16న మధ్యాహ్నం క్యాబినెట్ మీటింగ్‌తో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఎం నిర్ణయం ప్రకటిస్తారని రైతులంతా ఎదురుచూస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



అప్పు తెచ్చి వ్యవసాయం చేస్తే వడ్డీలకే సరి



ఎరువులు, విత్తనాలు, ట్రాక్టర్ల కిరాయిలు, కూలీల ఖర్చులు బాగా పెరిగిపోయాయి. దీంతో సాగు పనులకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు తెస్తున్నా. వ్యవసాయం చేస్తే వచ్చే మొత్తం వడ్డీలకే సరిపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వానాకాలం సీజన్ ఆరంభానికి ముందే బ్యాంకులద్వారా రుణాలు, రైతుభరోసా సహాయం అందించాలి.

- కమలాకర్, రైతు, పాలకవీడు

- రైతు భరోసాపై చిగురిస్తున్న ఆశలు
- సాగు భూమి అంతటికీ పెట్టుబడిసాయం
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రభుత్వం నిర్ణయం
- 20న పీఎం కిసాన్ యోజన సైతం

స్థానిక సంస్థల్లో భాగమైన జిల్లాపరిషత్, మండల పరిషత్ పాలకవర్గాల ఎన్నికల అనంతరం గ్రామ పంచాయతీలకు సర్పంచ్, పట్టణాలకు మునిసిపల్ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో రైతుభరోసా సాయం మంజూరుపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. గత యాసంగిలో కేవలం నాలుగు ఎకరాల వరకే ప్రభుత్వం రైతుభరోసా నగదును రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. దీంతో మిగతా రైతులంతా నిరుత్సాహం చెందారు. అయితే ఈసారి రైతుభరోసా కోసం పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చుకొని ఎకరాలతో నిమిత్తం లేకుండా అందరి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు చర్చ సాగుతోంది.

ఉమ్మడి జిల్లాలో 11.56లక్షలకు పైగా పట్టాదారులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 21.50లక్షల ఎకరాలకు పైగా సాగు భూమి ఉండగా పట్టాదారులు 11,56,800 మంది వరకు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5,65,788 మంది పట్టాదారులు, యాదాద్రి జిల్లాలో 2,84,250 మంది, సూర్యాపేట జిల్లాలో 3,06,760 మంది పట్టాదారులు ఉన్నారు. వీరందరి బ్యాంకు ఖాతాల్లో రైతుభరోసా నగదు జమ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సాగుచేసే భూమి అంతటికీ పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. గతంలో ప్రభుత్వం ఏ మేరకు రైతుభరోసా ఇస్తుందనే దానిపై ఓ నిర్ణయానికి రాకపోవడంతో ప్రతీ సీజన్‌లో రైతులు ఆందోళనకు గురయ్యారు. గత ప్రభుత్వం రైతుల పాస్‌బుక్‌లో ఎంత భూమి ఉంటే అంత రైతు బంధు నగదును జమచేసింది. దీంతో గుట్టలు, వెంచర్ భూములకు సైతం పెట్టుబడి సాయం అందిందని నాడు కాంగ్రెస్ నాయకులు ఆందోళనలు నిర్వహించారు. గతం ప్రభుత్వ హయాంలో ప్రజాధనం వృథా అయిందని భావించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో డివిజన్ల వారీగా రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ చేసింది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఇప్పటికీ ఎన్ని ఎకరాలకు పెట్టుబడి సాయాన్ని చెల్లిస్తారనేదానిపై స్పష్టత లేదు. గత రెండు రోజులుగా మాత్రం సాగు చేసే భూమి మొత్తానికి ఈ వారం రోజుల్లోపై రైతుభరోసా చెల్లిస్తామని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుందనే వార్తలు రావడంతో రైతుల్లో ఆశలు పెరిగాయి.

పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ఈ వారంలోనే...

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ యోజనకు సంబంధించిన పెట్టుబడి సాయం నగదు ఈ వారంలోనే రైతులకు అందనుంది. ఈ నెల 20వ తేదీన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే పీఎం కిసాన్ సమ్మాన్ యోజన సాయం రైతుల ఖాతాలో జమకానున్నాయి. ప్రతీ రైతు ఖాతాలో రూ.2వేలు జమ చేయనున్నారు. ఇన్‌కంట్యాక్స్(ఐటీ) చెల్లిస్తున్న రైతులకు మినహా, ఇతర సన్న, చిన్నకారు రైతులకు ఈ సాయం

- మిగతా 7వ పేజీలో...

వల్లభరావు చెరువులో ఆక్రమణలే లేవట?

చెరువు సర్వేలో గోల్‌మాల్



- శిఖం అన్యాక్రాంతం కాలేదని తప్పుడు నివేదిక
- అసలు సర్వే చేశారా అనే అనుమానాలు
- గతంలో ఆక్రమణకు గురైదని పోలీసులకు అధికారుల ఫిర్యాదు
- ప్రస్తుతం అంతా సరేనంటూ రెవెన్యూశాఖ బుకాయింపు
- వత్తాసు పలుకుతున్న నీటిపారుదలశాఖ అధికారులు

నల్లగొండ పట్టణంలోని వల్లభరావు (బతుకమ్మ కుంట) చెరువు భూమి ఎలాంటి ఆక్రమణలకు గురికాలేదని రెవెన్యూ అధికారులు నివేదికను రూపొందించడంపై పలు ఆరోపణలు వినవస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 8న వల్లభరావు చెరువు ఆక్రమణపై కథనం ప్రచురించగా, ఆక్రమణదారులు ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

'ఆంధ్రజ్యోతి' కథనం అనంతరం ఆక్రమణల విషయాన్ని తేల్చాలని నల్లగొండ మండల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించాలని సర్వేయర్‌కు బాధ్యతలు అప్పగించారు. సదరు సర్వేయర్ చెరువు సర్వేను మమ అనిపించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారికి సర్వే చేస్తున్న సమయంలోనే వల్లభరావు చెరువును సర్వే చేశానని సదరు సర్వేయర్ పేర్కొంటుండగా, కేవలం 10 నుంచి 20 నిమిషాల్లో 86 ఎకరాల వల్లభరావు చెరువును ఎలా సర్వే చేశారని స్థానికలు ప్రశ్నిస్తున్నారు. దీని వెనక కొందకు చక్రం తిప్పి అధికారులతో కుమ్మకై ఎలాంటి ఆక్రమణలు జరగలేదని నివేదిక ఇచ్చేలా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గతంలో ఉన్న హద్దులను సైతం చెరిపేసి ప్రహరీలు నిర్మించి గేట్లను ఏర్పాటు చేసుకున్నట్టు బహిరంగంగా కన్పిస్తుండగా, గతంలో ఆక్రమణ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఆ తరువాత నీటిపారుదలశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో తిరిగి యథావిధిగా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. పక్కన సర్వే నెంబర్‌లో చెరువు శిఖం భూమిని చూపిస్తూ తప్పుడు పత్రాలు సృష్టించి కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారు. సుమారు 86ఎకరాలు కలిగిన చెరువు శిఖం ఆక్రమణలకు గురైంది. మూడేళ్ల క్రితం వల్లభరావు చెరువు ఆక్రమణకు గురికావడంతో పోలీసుబందోబస్తు మధ్య అధికారులు ఆక్రమణలను తొలగించడమేగాక, హద్దులను కూడా నిర్ణయించారు.

మళ్లీ ఆక్రమించినా పట్టించుకోని అధికారులు

ఆక్రమణలు కొంతకాలం సద్దుమణిగినా మళ్లీ కొద్ది రోజులుగా చెరువు శిఖాన్ని ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. ఎలాంటి కాగితాలు లేకున్నా కొత్తగా సృష్టించి ప్రహరీలు నిర్మిస్తున్నారు. చెరువు శిఖంలో నీటిపారుదలశాఖ అధికారులు గతంలో హద్దులు నిర్ణయించి దిమ్మెలు నిర్మించారు. ప్రస్తుతం ఆ దిమ్మెలు నామరూపాలు లేకుండా పోయాయి. దీంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా చెరువు శిఖాన్ని కబ్జా చేస్తున్నారు. శిఖంలో హద్దులు దాటివచ్చి ప్రహరీలు నిర్మించడమేగాక మట్టి పోసి చదును చేశారు. కోట్ల రూపాయల విలువచేసే భూమి అన్యాక్రాంతం అవుతున్నా అటు రెవెన్యూఇటు నీటిపారుదలశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.ఇటీవల సర్వే నిర్వహించారా? లేదా?అనే విషయంపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం కాగితాలపైనే తప్పుడు నివేదిక అందజేసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది.

అప్పుడు ఆక్రమణలు, ఇప్పుడు సక్రమం ఎలా?

గతంలో వల్లభరావు చెరువును నీటిపారుదలశాఖ..

- మిగతా 8వ పేజీలో...

ప్రజలకు అండ సీపీఐ జెండా

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

పెద్దవూర, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉద్యమాలే ఊపిరిగా ప్రజలకు అండగా సీపీఐ జెండా నిలబడి పోరాడుతోందని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మండలంలోని పులిచర్ల గ్రామంలో జరిగిన సీపీఐ మహాసభలో ఆయన మాట్లాడారు. ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజా ఉద్యమాలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సీపీఐ అని అన్నారు. బడుగు, బలహీనవర్గాలను ఏకం చేసి రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన సీపీఐ నాయకత్వ వహించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు.

నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదల నడ్డివిరిచేలా వంట గ్యాస్ ధరలు పెంచిందన్నారు. పంటకు గిట్టుబాటు ధర, ఎరువులు, విత్తనాలను సబ్సిడీతో ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భిక్షంరెడ్డి, మండల కార్యదర్శి గడ్డంపల్లి భిక్షం రెడ్డి, నాయకులు పొదిల నరసింహ, లక్ష్మీపతి, రొయ్య రాములు, శోభన్‌బాబు, నాగార్జున, జయప్రకాశ్‌రెడ్డి, విజయానంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విజయాలను ప్రచారం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం



నార్కట్‌పల్లి సమావేశంలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లలో సాధించిన విజయాలను పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎంతో ముందడుగు వేస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా దేశం కీర్తి ప్రతిష్ట లు పెరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీని గ్రామస్థాయిలో పటిష్ఠం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్, నకిరేకంటి మొగులయ్య, పజ్జూరి వెంకట్‌రెడ్డి, పాల్వాయి భాస్కర్‌రావు, శంకర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ ఫిలిం అవార్డ్స్ జ్యూరీ సభ్యుడిగా మధు

మిర్యాలగూడ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్‌లో మిర్యాలగూడ పట్టణవాసి వాకిటి మధు జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటి వెంకట్‌రెడ్డి నుంచి జ్యూరీ సభ్యుడిగా మధు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ అవార్డుల ఎంపిక కమిటీలో జ్యూరీ సభ్యుడిగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మెమొంటో అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటి వెంకట్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా, జ్ఞాపిక అందుకున్న మధును పట్టణ ప్రముఖులు అభినందించారు.



మెమొంటో అందుకుంటున్న వాకిటి మధు





ఆధ్యాత్మికతకు ఆలవాలం

అర్వపల్లిలో 12వ శతాబ్దం నాటి ఆలయాలు

సూర్యాపేట జిల్లా అర్వపల్లి ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. 12వ శతాబ్దం నుంచి చరిత్ర కలిగిన దేవాలయాలు జాజిరెడ్డి గూడెం మండలం అర్వపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో నేటికీ విరాజిల్లుతున్నాయి. పెద్ద పెద్ద గుట్టల మధ్యలో దేవాలయాలు చూసేందుకు చూడముచ్చటగా ఉన్నాయి. దేవాలయాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-అర్వపల్లి)

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి కాకతీయుల కాలంనాటి చరిత్ర ఉంది. కాకతీయుల సామంత రాజు అన్నపురాయుడు కాలం నాటిది ఈ దేవాలయం. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ఇక్కడ ఉత్సవమూర్తులు విరాజిల్లుతున్నారు. మాఘమాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతి యేటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారికి 750 ఎకరాల మాన్యాలు ఉన్నాయి. రూ.కోటితో అభివృద్ధి చేసినా నేటి వరకూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది పరిస్థితి. రెండు శతాబ్దల నుంచి చెక్కు చెదరని రథం నేటి వరకు అలాగే దర్శనమిస్తుంది.

అద్భుతంగా సూర్యనారాయణక్షేత్రం

రాష్ట్రంలో తొలి అఖండ జ్యోతిస్వరూప సూర్యనారాయణక్షేత్రాన్ని మండలంలోని తిమ్మాపురం గ్రామ గుట్టల మధ్య నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి తరహాలో ఈ దేవాలయాన్ని నిర్మించారు. క్షేత్ర ప్రాంతంలో కాస్మోటిక్ ఎనర్జీ అత్యధికంగా ఉన్నట్లు గుర్తించారు. దేవాలయంలో ప్రతీ ఆదివారం మహా సౌర యాగాన్ని నిర్వహిస్తారు. దేవాలయ వెనక భాగంలో కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం ప్రసిద్ధి గాంచింది.

మత సామరస్యానికి ప్రతీక

జాజిరెడ్డిగూడెం-అర్వపల్లి గుట్టల మధ్య వెలిసిన ఖాజానసీరొద్దీన్ బాబా దర్గా హిందూ, ముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. 50 ఫీట్ల ఎత్తులో దర్గాను నిర్మించారు. దర్గాలో ప్రతీ శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. దర్గా వద్ద చెలిమ బావి వేసవిలోనూ ఎండిపోకుండా ఉంటుంది. ప్రతీ సంవత్సరం దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఉర్సు ఉత్సవాలకు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్లగొండ, సంగారెడ్డి, మహబూబాద్, ఖమ్మం, ఏపీ నుంచి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి అధిక సంఖ్యలో మంది భక్తులు తరలివస్తారు.

ఉమామహేశ్వర దేవాలయం

కాకతీయుల కాలంలో ఉమామహేశ్వర దేవాలయాన్ని పెద్ద రాతిని తొలిచి నిర్మించారు. దేవాలయంలో శివలింగం ఉంది. మహాశివరాత్రికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి క్షీరాభిషేకం నిర్వహిస్తారు. కార్తీకమాసంలో భక్తులు ప్రతీరోజు పూజలు చేస్తారు. చిన్న పిల్లలకు శని పూజలు చేస్తారు. దేవాలయం ముందు ఆంజనేయస్వామి విగ్రహం రాతి కట్టడంతో ఉంది. ఉమామహేశ్వరస్వామి వారికి ప్రతీ సంవత్సరం దేవాలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

భక్తులకు అపార నమ్మకం



అర్వపల్లి యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఇలవేల్పుల స్వామి. కోరిన కోర్కెలు తీరుస్తుండడంతో భక్తులకు అపార నమ్మకం. స్వామి వద్ద నిత్యం అభిషేకాలు జరుపుతాం. ఇతర ప్రాంతాల నుంచి ప్రతి నిత్యం భక్తులు విచ్చేస్తారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం.

పవన్, అర్చకుడు, యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం

భక్తుల కొంగుబంగారం గొడకొండ్ల

వైష్ణవ ఆచార సంప్రదాయ ప్రకారం పూజలు


ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలు

చింతపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడకొండ్ల గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఇటీవల పురావస్తు శాస్త్రవేత్త ఈమని శివనాగిరెడ్డి ఆలయాన్ని సందర్శించి, ఈ దేవాలయం సుమారు 850 ఏళ్ల క్రితం నిర్మించారని, కాకతీయుల కాలం నాటిదని తెలిపారు. ఆలయంలో వైష్ణవ సంప్రదాయం ప్రకారం నిత్యం దూపదీప నైవేద్యాలు కొనసాగుతున్నాయి. నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, గుంటూరు తదితర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొంటున్నారు.

ఆలయ అభివృద్ధి కృషి



ఆలయంలో ప్రతి సంవత్సరం వైష్ణవ ఆచారం ప్రకారం ఉట్లు కొట్టే కార్యక్రమంతోపాటు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నాం. దేవాలయ భూములను కౌలుకు ఇచ్చి రైతులు ఇచ్చే డబ్బులతోపాటు దాతల సహకారంతో ఆలయ నిర్వహణ నిర్వహిస్తున్నాం. సొంత డబ్బులతో రూ.30లక్షలతో ఆలయ గోపురాలను అత్యంత వైభవంగా నిర్మించాం. ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం.

అంగిరేకుల గోపాల్, ఆలయ చైర్మన్, గొడకొండ్ల

కొత్త బస్‌లోనూ ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉత్తదే..


ఖాళీగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్

మోత్కూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గతంలో ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఉండేవి. ఏదైనా ప్రమాదం జరిగి ఎవరైనా ప్రయాణికుడు గాయపడితే వెంటనే అక్కడే ప్రాథమిక చికిత్స చేయడానికి టించర్ ఆఫ్ అయోడిన్, కాటన్‌లాంటివి అందులో ఉండేవి. కాలక్రమేణ మొదట ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లో మందులు (మెడిసిన్) కనుమరుగయ్యాయి. ఆ తర్వాత బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లే లేకుండా పోయాయి. ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా ఆర్టీసీకి ఎలక్ట్రికల్ బస్సులు ఇచ్చింది. అందులో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లున్నాయి. ఎన్ని రోజులకు బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లు కన్పించాయన్న ఆనందంతో ఓ ప్రయాణికుడు సూర్యాపేటకు చెందిన ఎలక్ట్రికల్ ఆర్టీసీ కొత్త బస్సులో డ్రైవర్‌తో బాక్స్ తెరిపించి చూడగా అందులో ఏమీ లేవు. అంతమాత్రానికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్ పెట్టడమెందుకని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

‘దాసి’ కళానిలయాన్ని సందర్శించాలి


వాల్‌పోస్టర్లను చూపుతున్న కవులు

నాగార్జునసాగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు హిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన, దాసి చిత్ర కళా నిలయాన్ని సందర్శించాలని ప్రముఖ కవి బెల్లి యాదయ్య అన్నారు. ఆదివారం సాగర్ హిల్‌కాలనీలో దాసి చిత్ర కళా నిలయంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ సాహిత్యం, సమకాలీనత అనే అంశంపై మాట్లాడారు. అనంతరం అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ కార్టునిస్టు నరసింహ, కస్తూరి ప్రభాకర్, రామలింగయ్య, రామ్మోహన్, తిరుమల, స్వతంత్ర, కిరణ్మయి, పాండు, మున్నా, జగన్మోహన్, బాలేశ్వర్ పాల్గొన్నారు.

ఆరేళ్లయినా పిల్లర్లకే పరిమితం

● పూర్తికాని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం ● అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిన పనులు


పిల్లర్ల దశలోనే ఆగిపోయిన నిర్మాణం

కొండమల్లేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం ఆరేళ్లయినా పిల్లర్లకే పరిమితమైంది. పాత కమ్యూనిటీ హాల్ భవనాన్ని కూల్చి ప్రజల సౌకర్యార్థం నూతన హంగులతో కొత్త భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. 2019 నవంబరులో రూ.25లక్షలు వెచ్చించి అప్పటి ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పిల్లర్ల దశలోనే పనులు నిలిపివేయడంతో ఇప్పటివరకు కూడా పనులు సాగడంలేదు. కాంట్రాక్టర్ అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణ పనుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



సాధ్యమైనంత త్వరగా ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టాలి. 2019లో మొదలు పెట్టిన నిర్మాణ పనులు ఆరేళ్లయినా పిల్లర్ల దశలోనే ఉన్నాయి. ఇప్పటికీ పూర్తికాలేదు. సభలు, సమావేశాల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కమ్యూనిటీ నిర్మాణ పనులు పూర్తయ్యేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలి.

ఎదుళ్ల ఎల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు

జీవితం ఆనందంగా గడపాలి

● హ్యాపీ లైఫ్ పుస్తకావిష్కరణలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


హ్యాపీలైఫ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క, చిత్రంలో వేణుగోపాల్‌రెడ్డి, విజయార్కె

మరంపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సంతోషం లేని జీవితం ఎంత సంపద ఉన్నా పరిపూర్ణం కాదని, జీవితం ఆనందంగా గడపాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు తాటికొండ వేణుగోపాల్‌రెడ్డి, ప్రముఖ రచయిత విజయార్కెలు రాసిన ‘హ్యాపీ లైఫ్.. మీఆనందం మీ చేతుల్లో’ పుస్తకాన్ని ఆదివారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి పుస్తకాల అవసరం ఉందని, ఈ పుస్తకం జీవితంలో సంతోషాన్ని కోరుకునే ప్రతీ ఒక్కరికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సమాజానికి అవసరమయ్యే హ్యాపీ లైఫ్ పుస్తకాన్ని రాసిన రచయితలను ఆయన అభినందించారు. టి.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు నెలలపాటు శ్రమించి సంతోషకరమైన జీవితానికి ఉపయోగపడే ఎన్నో అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచామని, జీవితంలో కోల్పోతున్న సంతోషాన్ని మీకు ఈ పుస్తకం పరిచయం చేస్తోందన్నారు. రచయిత విజయార్కె మాట్లాడుతూ సంతోషం లేని జీవితం ఆత్మలేని దేహంలాంటిదని, సంతోషాన్ని మించిన సంతృప్తి లేదన్నారు. సంతోషకరమైన జీవితాన్ని మీకు ఈ పుస్తకం ద్వారా అందించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంట్‌సభ్యుడు అంజనికుమార్‌యాదవ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు.

జీవోలకు కేరాఫ్ మంగరాజు

● రెండు దశాబ్దాలుగా సేకరణ ● అవసరమైన వారికి ఉచితంగా అందజేత


తను సేకరించిన జీవో ప్రతులతో మంగరాజు శ్రవణ్ కుమార్

భువనగిరి (కలెక్టరేట్), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోలు)ను సేకరించి, వాటిని భద్రపరచడంలో మంగరాజు శ్రవణ్ కుమార్ ఆదర్శంగా నిలుస్తున్నారు. అవసరమైన సమయంలో కావాల్సిన జీవో ప్రతులను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. తన తండ్రి ఎదుర్కొన్న ఇబ్బందులు ఉద్యోగ, ఉపాధ్యాయులు పడకుండా ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సేకరించి భద్రపరుస్తూ అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తున్నారు. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా పంచాయతీరాజ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మంగరాజు శ్రవణ్ కుమార్ రెండు దశాబ్దాలుగా ... ప్రభుత్వ ఉత్తర్వులను సేకరించి భద్రపరుస్తున్నారు.

తన తండ్రిలా ఎవరూ బాధ పడకూడదని..

భువనగిరి పట్టణానికి చెందిన మంగరాజు కులకర్ణి-శారదాదేవి కుమారుడు శ్రవణ్ కుమార్. శ్రవణ్ తండ్రి విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో ఉద్యోగం నుంచి స్వచ్ఛంద విరమణ చేయాలనుకున్నారు. సాంకేతిక సమస్యలతో స్వచ్ఛంద విరమణకు ప్రభుత్వ నిబంధనలు సరిపోలేదు. ఆ సమయంలో సరైన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతులు లభ్యమైతే విరమణ సాధ్యమయ్యే అవకాశం ఉంది. జీవో ప్రతుల కోసం తీవ్రంగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 1990లో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన శ్రవణ్ కుమార్‌కు జీవో ప్రతులు లభించక తన తండ్రి పడిన ఇబ్బందులు ఉద్యోగులు పడకూడదని జీవో ప్రతులు సేకరించడం మొదలుపెట్టారు. నాటినుంచి నేటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ జీవోలను సేకరించి భద్రపరచడమే కాకుండా అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే జీవోలు సేకరించడంతో ఉత్తమ ఉద్యోగిగా అవార్డు పొంది పలు సత్కారాలు అందుకున్నారు.

జీవో కాపీలకు సంప్రదించాలి

1975నుంచి ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీలు అవసరమైన వారు సంప్రదించవచ్చు. ఎలాంటి జీవోలు అయినా భద్రంగా ఉన్నాయి. ఇప్పటికే 1200కుపైగా ఉద్యోగులకు స్వయంగా, పోస్టు ద్వారా ఉచితంగా అందజేశాను. ఉద్యోగ బాధ్యతతోపాటు సమాజసేవ చేయాలనే తలంపుతోనే ఈ నిర్ణయం తీసుకున్నా. ఎవరికైనా అవసరమైన జీవో ప్రతులు కావాలంటే 9440756656ను సంప్రదించవచ్చు.

శ్రవణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్, జిల్లా పంచాయతీరాజ్ శాఖ

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం


హుజూర్‌నగర్‌లో ఉత్సవమూర్తి విగ్రహాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అగ్ని ప్రతిష్ఠ, శాంతిపటం, గరుడ హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. అనంతరం విష్ణుసహస్ర పారాయణం, దేవతాహ్వానం, బేరీ తాండవం, నిత్యహోమ పూర్ణాహుతి, బలిహరణం, చంద్రప్రభ వాహనసేవ, ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహించారు. కాగా సోమవారం దేవాలయంలో గోదాపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అమృతారెడ్డి, మల్లీశ్వరి, గుండా శ్రీనివాస్, పచ్చిపాల మల్లిఖార్జున్‌రావు, చలువాది ఆదినారాయణ, తేలుకుంట్ల శ్రీనివాస్, గజ్జి ప్రభాకర్, ఏలూరి రాంబాబు, సైదులు, సైదారత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

మఠంపల్లి: మండలంలోని కామాంచికుంటతండాలో సీతారామాంజనేయ స్వామి దేవాలయ ఆరో వార్షికోత్సవం ఆదివారం వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. బొడ్రాయి, గ్రామదేవతలకు బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమం గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా సౌర హోమం


సౌరహోమం అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం సమీపంలో గల అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణక్షేత్రంలో ఆదివారం ఘనంగా మహాసౌరహోమం నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులు పాల్గొని పూజలుచేశారు. సూర్యనారాయణక్షేత్రం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో కాకులారపు రజిత, గనాపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, కసరబోయిన సత్యనారాయణ, యాదగిరి, మణికంఠ, భీంపాండే పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి


నివాళి అర్పిస్తున్న నాయకులు

తుంగతుర్తి, జూన్ 15, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గానుగబండ గ్రామానికి చెందిన మాజీ వార్డుసభ్యుడు, బీఆర్ఎస్‌నేత పంజాల సోమయ్య (57) ఈ నెల 2వ తేదీన తాటిచెట్టు మీది నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్, మాజీ సర్పంచి రామచంద్రారెడ్డి సోమయ్య మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దుర్గయ్య, ఉపసర్పంచ్ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

పని బంగారం బతుకు నిస్సారం

● నిలకడ లేని ధరలు.. విరివిగా వెలుస్తున్న కార్పొరేట్ జ్యువెలరీలు ● చితికిపోతున్న స్వర్ణకారుల జీవితాలు ● ఇతర రంగాలకు వలస



కులవృత్తులు రోజురోజుకూ వాటి ఉనికిని కోల్పోతున్నాయి. మనుగడ కోసమని భావించిన కొందరు బతుకు దారి మార్చుకుంటున్నారు. మరికొందరు ఇప్పటికీ తాతల కాలం నుంచి వారసత్వంగా స్వీకరించి స్వర్ణకార వృత్తినే నమ్ముకుంటూ నానాయాతన పడుతున్నారు. పని బంగారం.. కాని బతుకే నిస్సారంగా మారిందని పలువురు స్వర్ణకారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-రామగిరి)

ఏ ఇంట్లో శుభకార్యం తలపెట్టినా ముందుగా గుర్తుకొచ్చేది బంగారం దుకాణమే. పెళ్లి కుమార్తెను అందంగా అలంకరించాలన్నా, వాళ్ల అందాన్ని రెట్టింపు చేయాలన్నా బంగారు ఆభరణాలే ప్రధానం. అలాంటి బంగారు ఆభరణాలు తయారు చేయాలంటే దాని వెనుక పెద్ద కష్టమే ఉంటుంది. నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, దేవరకొండ, మాల్, చండూర్, నార్కట్‌పల్లి, నకిరేకల్, సాగర్, హాలియా, మల్లెపల్లి, చిట్యాలవంటి ప్రాంతాల్లో సుమారు 10 నుంచి 20వేలకు పైగా స్వర్ణకార కుటుంబాలు ఉన్నాయి. ఆభరణాల రంగంలో కార్పొరేట్ జ్యువెలరీ షాపులు పెద్ద ఎత్తున వెలవడంతోపాటు వాయిదాల పద్ధతినా బంగారు ఆభరణాలు విక్రయిస్తుండడంతో వినియోగదారులు కార్పొరేట్ జ్యువెలరీ షాపుల్లో కొనుగోలు చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. ఈ కార్పొరేట్ వ్యవస్థ కారణంగా స్వర్ణకారులు వృత్తి పనులు కోల్పోతున్నారు.

కూలీలుగా మారుతున్న స్వర్ణకారులు

పెరుగుతున్న బంగారం, వెండి ధరల కారణంగా, సర్వం యంత్రాలమయంకావడంతో స్వర్ణకారులకు చేతినిండా పని లేకుండా పోయింది. దీంతో కొందరు పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయలేక బ్యాంకుల్లో అప్రైజర్లుగా చేరిపోయారు. బతుకు బండిని లాగేందుకు కార్పొరేట్ జ్యువెలరీ షాపుల్లో గుమస్తాలుగా చేరేవారు కొందరైతే.., మరికొంతమంది భవన నిర్మాణ కార్మికరంగంలో కూలీలుగా మారి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇంకొంత మంది ఇడ్లీ, టీబండ్లను నడుపుకునే పరిస్థితి ఏర్పడింది. ఇక ఇతర వృత్తుల్లోకి వెళ్లడం ఇష్టంలేని మరికొంత మంది స్వర్ణకారులు రాగి, ఇత్తడి, పంచలోహ తాయితలు, ఇతర చిన్న చిన్న వస్తువులను తయారు చేస్తూ వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం స్వర్ణకార వృత్తి చేస్తున్న వారెవరూ కూడా వారి పిల్లలకు ఈ వృత్తిని నేర్పించడానికి ఇష్టపడటం లేదు. ప్రభుత్వం ఇతర చేతి వృత్తుల వారికి ఇచ్చిన మాదిరిగా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

ఇత్తడి పుస్తెలు చేయాల్సి వస్తోంది



బంగారం ధరలు విపరీతంగా పెరగడం, మార్కెట్‌లో కార్పొరేట్ జ్యువెలరీ షాపులు విరివిగా వెలుస్తుండడంతో బంగారం, వెండి పని చేసేవారికి చేతి నిండా పని లేకుండా పోయింది. కొన్ని దుకాణాల్లో వాయిదాల పద్ధతిన ఆభరణాలు విక్రయిస్తున్నందున వినియోగదారులు అటువైపే వెళ్తున్నారు. పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయలేక, ఇతర రంగంలో పనులు చేయడం ఇష్టంలేక, నమ్ముకున్న స్వర్ణకార వృత్తిల్లో ఇత్తడి పుస్తెలు, పంచలోహ ఉంగరాలు చేస్తూ కుటుంబాలు వెళ్ల దీసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి.

రాగిఫణి విష్ణుమూర్తి, స్వర్ణకారుడు నల్లగొండ

ప్రభుత్వం ఆదుకోవాలి



ధరల హెచ్చుతగ్గులు, కార్పొరేట్ జ్యువెలరీ దుకాణాలతో వృత్తిని నమ్ముకున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్థికంగా అంతో ఇంతో ఉన్న వారికే వ్యాపారాలు నడుస్తున్నాయి. ఆర్థికంగా లేని స్వర్ణకారులు కార్పొరేట్ జ్యువెలరీ షాపుల్లో గుమస్తాలుగా చేరుతున్నారు. మరికొంత మంది వెల్డింగ్ షాపుల్లో, భవన నిర్మాణ రంగంలో కూలీలుగా మారారు. ప్రభుత్వాలు స్పందించి వ్యాపారాల ఏర్పాటుకు ప్రతీఒక్కరికి వడ్డీ లేకుండా రూ.20లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలి. అప్పుడే స్వర్ణకారులు గౌరవప్రదంగా బతకగలరు.

రాచకొండ గిరి, స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్షుడు, నల్లగొండ

పలువురిపై కేసు

నాగారం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నాగారంలో ఈ నెల 10న ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కాంగ్రెసుకు చెందిన ఇరు వర్గాలనేతలు ఘర్షణ పడ్డారు. నాగారం పీఎస్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి కాంగ్రెస్‌నేతలైన జాజుల వీరయ్య, మంగదుడ్ల దశరథ, కన్నెబోయిన గట్టయ్యలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే ఘర్షణలో మరో వర్గం నాయకులపై 5 రోజుల క్రితం కేసు నమోదుచేశారు.

పేకాట స్థావరంపై దాడి

గరిడేపల్లి, జూన్ 15 ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో పేకాట స్థావరంపై దాడి చేసి 10 మందిని పట్టుకున్నారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కట్టవారిగూడేనికి చెందిన పట్టేటి శ్రీకాంత్, రాయిరాల కొండల్, గోపిచంద్, పూసపాటి వినయ్, గాంధీ భాస్కర్, లేత సురేష్, పఠాన్ సైదా, రాయిరాల గోపి, గండమళ్ల వెంకన్న, మీసాల శివాజీ, దారరాజు, పఠాన్ మహబూబ్ అలీ పేకాట ఆడుతుండగా పట్టుకోగా, ముగ్గురు పారిపోయినట్లు తెలిపారు. దాడిలో రూ.4250, 7 సెల్‌ఫోన్లు, 7 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఉద్యాన విద్య.. ఉజ్వల భవిత



వాతావరణంలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కాలుష్యంతో భూమి వేడెక్కుతోంది. సకాలంలో వర్షాలు పడటం లేదు. ఒక్కో ప్రాంతంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడి చాలా ప్రాంతాల్లో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిల్లో తక్కువ నీటి వినియోగంతో పండే పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ఉద్యాన పంటలతో సాగులో నీటి ఆదాతో పాటు రాబడి వస్తుంది. భవిష్యత్‌లో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరుగుతుండడంతో ఈ రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగు పడే అవకాశం ఉంది.

- ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ, (వ్యవసాయం)

- రెండేళ్ల క్రితం గడ్డిపల్లిలో ఉద్యాన కళాశాల ఏర్పాటు
- సేంద్రియ పద్ధతులు, మొక్కల సాగుపై శిక్షణ

గడ్డిపల్లిలో ఉద్యాన కళాశాల..

ఉద్యాన పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానం పెంపొందించడానికి ప్రభుత్వం కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఆదిలాబాద్ జిల్లా దస్నాపూర్, పెద్దపల్లి జిల్లా రాంగిరి ఖిల్లా, నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్, సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి లోకి కృషి విజ్ఞాన కేంద్రంలో -2023లో డాక్టర్ ఘంటా గోపాల్‌రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నిక్ డిప్లొమా రెండేళ్ల కోర్సు ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో మొత్తం సీట్ల సంఖ్య-200 కాగా గడ్డిపల్లికి 40 సీట్లు కేటాయించారు.

విద్యా బోధన..

- డిజిటల్ తరగతులు, అత్యాధునిక ప్రయోగశాల ద్వారా బోధన
- బాలురకు, బాలికలకు వేరుగా వసతి గృహం, భోజన వసతి
- ప్రభుత్వ ప్రోత్సాహంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు
- విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం, శిక్షణ మెలుకువలు నేర్పడం. కళాశాలల ద్వారా ఇంటర్న్‌షిప్ నిర్వహించి విద్యార్థులకు ప్రఖ్యాతి గాంచిన సంస్థలకు అనుసంధానం చేయడం
- విద్యార్థులకు క్షేత్ర సందర్శనలో భాగంగా హరిత గృహల్లో పంటల సాగు, ఆధునిక టెక్నాలజీ ఉన్న నర్సరీల్లో మొక్కల పెంపకం, పంటలలో యాంత్రీకరణ వినియోగం, పంటల సస్యరక్షణ, అధిక సాంద్రత పద్ధతి ద్వారా పండ్లు,కూరగాయ పంటల సాగుపై శిక్షణ,సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై తరగతులు,అవగహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- విద్యార్థులకు వివిధ ప్రాంతాల్లోని పంటలు, పరిశ్రమల సందర్శన,
- మట్టి నమూనా పరీక్షా, జీవన ఎరువుల ప్రయోగశాల, విత్తన ఉత్పత్తి యూనిట్, షేడ్ నెట్ హౌస్‌లోని పండ్లతోటలలో యాజమాన్యం, పూలు కూరగాయ మొక్కల పెంపకం, వర్మికంపోస్ట్, పుట్టగొడుగులు, అజొల్లా, తేనెటీగల పెంపకం, కోళ్ల విభాగాలలో నాణ్యమైన ప్రదర్శన.
- కళాశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక లైబ్రరీ, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు



ఉన్నత విద్య కోసం...

ఉద్యాన పాల్ టెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఉద్యాన బీఎస్సీ కోర్సుల్లో చేరవచ్చు. తెలంగాణలో హైదరాబాద్, వనపర్తి, మహబూబాబాద్‌లో బీఎస్సీ కళాశాలలు ఉన్నాయి. మొత్తం సీట్ల సంఖ్య-280, ఉద్యాన విశ్వవిద్యాలయం నిర్వహించే హార్టీసెట్ పరీక్ష ద్వారా 15శాతం విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయి.

- హార్టీ సెట్‌లో అర్హత సాధించని విద్యార్థులు వివిధ డిగ్రీలు కోర్సులలో చేరవచ్చు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు..

- వివిధ సంస్థలు నేరుగా కళాశాలకు వచ్చి ఇంటర్వ్యూలతో ప్రతిభ ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.
- గత నెలలో కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాలో జెన్‌క్రెస్ట్ (సమత) గ్రూప్ వారు నిర్వహించిన ఇంటర్వ్యూలతో ఐదుగురు విద్యార్థులకు నెలకు రూ.23వేల వేతనంతో ఉద్యోగం సాధించారు.
- తెలంగాణ ప్రభుత్వ శాఖ అయిన ఉద్యాన విభాగంలో ఉద్యాన విస్తీర్ణ అధికారిగా (హెచ్ఈవో)ఉద్యోగం సాధించడానికి అర్హులు
- ఆయిల్ పామ్, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కంపెనీలతో అభివృద్ధి.

ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రత్యేకతలు

అర్హత : పదో తరగతి, పాల్‌టెక్నిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.600, ఇతర అభ్యర్థులకు రూ.1200.
దరఖాస్తు చివరి తేదీ : ఈ నెల 26
కౌన్సిలింగ్ ద్వారానే సీట్ల కేటాయింపు
దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు:
పదవ తరగతి మార్కుల జాబితా.పాఠశాల టీసీ, 1-10 వతరగతి వరకు బోనఫైడ్ ఆధార్ కార్డు, పాస్ ఫొటో, బ్యాంకు డి.డి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ WWW. skltghu.ac.in సందర్శించండి లేదా గడ్డిపల్లి కళశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఉద్యాన శాస్త్రవేత్త, నరేష్‌ను సంప్రదించవచ్చు.
ఫోన్ నంబర్లు: 9603268682, 9121557037, 9398166973

- క్షేత్రస్థాయి అధికారిగా నియమితులవుతారు.
- స్వయంగా నర్సరీలు, పురుగు మందుల దుకాణాల స్థాపన, సేంద్రీయ ఉత్పత్తులు, మార్కెటింగ్ రంగాలలో స్వయం ఉపాధి
- ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల నిర్వహణ గ్రామీణ ప్రాంతాల్లో అవకాశాలు ఉన్నాయి.

విద్యార్థులకు మంచి భవిష్యత్



ఉద్యాన పాల్‌టెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో విద్యార్థులకు అత్యాధునిక విద్యా పరిజ్ఞానాన్ని అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అవగహన కోసం ప్రభుత్వం 30ఎకరాల వరకు కేటాయించింది. జామ, మామిడి, బత్తాయి, నిమ్మ, వెదురు, పామాయిల్ వంటి పంటలు వేశాం. ఎరువులు, నీటి యాజమాన్యంతో పాటు, సేంద్రియ కూరగాయల సాగుపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తున్నాం. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. పండ్ల తోటల విస్తీర్ణం పెరుగుతున్నందున ఈ కోర్సులు చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది.

- నరేష్, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఇన్ చార్జి ప్రిన్సిపాల్, ఉద్యాన శాస్త్రవేత్త, గడ్డిపల్లి.

మల్లాపురంలోనే మెడికల్ కళాశాల నిర్మించాలి

గుట్టలో బీఆర్ఎస్ నాయకుడు వెంకటయ్య ఆమరణ దీక్ష



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు వెంకటయ్య, అరెస్టు చేస్తున్న పోలీసులు



యాదగిరిగుట్ట రూరల్, జూన్ 15,(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య డిమాండ్ చేశారు. మల్లాపురం గ్రామంలో ఆయన ఆదివారం అమరణ నిరహార దీక్ష చేపట్టారు. వైటీడీఏ అభివృద్ధిలో భాగంగా దర్శనానికి వచ్చే భక్తులు, స్థానికులకు వైద్య సేవలు అందించడానికి మాజీ సీఎం కేసీఆర్ మండలంలోని మల్లాపురంలోని సర్వేనంబర్ 64లో 20 ఎకరాల స్థలం కేటాయించారని తెలిపారు. రూ.183కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి జీవో విడుదల చేశారని, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిర్మాణం ఆగిపోయిందన్నారు. గత ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కళాశాల నిర్మించకుండా దాతరపల్లి శివారు ప్రాంతంలో కళాశాల నిర్మించడానికి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆమరణ దీక్షకు యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, ఆలేరు మార్కెట్ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధబీరయ్య, మహేందర్ మద్దతు తెలిపారు.

దీక్షను భగ్నం చేసిన పోలీసులు

ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసి, వెంకటయ్యతోపాటు బరిగే నర్సింహులు, పల్లెపాటి మాధవును వలిగొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల అనుమతి లేకుండా ఆమరణ దీక్ష చేపట్టడం చట్టరీత్యా నేరమని ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. అనుమతి లేకుండా దీక్షకు చేపట్టిన వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, తన భర్త ఆచూకీ చెప్పాలని కర్రె వెంకటయ్య భార్య కమలమ్మ గుట్టలో ఆందోళన చేశారు. పోలీసులు వెంకటయ్యతో ఫోన్‌లో మాట్లాడించినప్పటికీ తన భర్తను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు సర్దిచెప్పి వారిని అక్కడి నుంచి పంపించారు.

నిరాహార దీక్ష భగ్నం చేయడం సరికాదు : గొంగిడి



యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 15,(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట మండలం మల్లాపురం గ్రామంలో మెడికల్ కళాశాల కోసం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య చేస్తున్న నిరాహార దీక్షను భగ్నం చేసి అరెస్టు చేయడం సరికాదని బీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్టలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల నిర్మాణంతో స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటుందనే ఆలోచనతో ఆమరణ నిరాహారదీక్ష చేయడంలో తప్పేమిటని ప్రశ్నించారు. కర్రె వెంకటయ్యను అరెస్టు చేశారని, ఆయన ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదన్నారు. ఆయనకు ఏదైనా జరిగితే స్థానిక ఎమ్మెల్యే, పోలీసులే బాధ్యత వహించాలన్నారు. ఆరెస్టులతో కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తే సహించమని, స్థానిక ఏసీపీ బాధ్యతాయుతంగా వ్యవరించాలన్నారు. ఈ ఇటీవల ఎమ్మెల్యే ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న వంటమనిషి మృతిని పక్కదారి పట్టించడానికి కర్రె వెంకటయ్యను సమయం ఇచ్చి రాత్రి సమయంలో చేయాల్సి ఉండగా మధ్యాహ్నం 2గంటలలోపే అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సంఘటనపై సోషల్ మీడియాలో వచ్చిన విషయాలపై కొంతమందిని బాధ్యులను చేసి అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఇలాంటి సంఘటనలకు తావ్వివలేదన్నారు. తమ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా దాడులు చేస్తే అందుకు నిరసనగా ఆలేరు బంద్‌కు పిలుపునిచ్చి ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న వంటమనిషి కుటుంబానికి రూ.2కోట్ల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల ఎక్కడ నిర్మించినా తమకు అభ్యతరం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో ఆలేరు మార్కెట్ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, విజయ్‌గౌడ్, రాజేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాకే
సర్వే చేయాలి

చిట్యాలరూరల్, జూన్ 15: బ్రాహ్మణవెల్లంల ఉదయసముద్రం కుడి కాల్వకు సంబంధించిన భూమి సర్వే పనులను బహిరంగ మార్కెట్ ధర ప్రకారం చెల్లించాకే చేపట్టాలని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. బ్రాహ్మణవెల్లంల ఉదయసముద్రం కుడి కాల్వ చిట్యాల మండలం వట్టిమర్తి వరకు వస్తుండగా ఆదివారం నీటిపారుదల శాఖ అధికారులు సర్వే నిర్వహించేందుకు వచ్చారు. నష్టపరిహారం విషయమే తేల్చలేదని రైతులు అడ్డుకున్నారు. గతంలో ఆర్డీవో సమక్షంలో తమ పరిస్థితిని వివరించినా నేటి వరకు దాన్ని పరిష్కరించకుండా సర్వేసేసేందుకు రావడమేంటని రైతులు ప్రశ్నించారు. తమ గ్రామానికి కాల్వ రావడం సంతోషమేనని భూమికి సంబంధించిన నష్టపరిహారం గురించి ఎలాంటి ప్రస్తావన తీసుకురాకుండా నేరుగా మా భూములు సర్వే చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రస్తుతం భూముల ధరలు విపరీతంగా పెరిగాయని భూములను కోల్పోతున్న వారికి బహిరంగ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించి సర్వే చేసుకుని భూములను తీసుకోవాలన్నారు. చెరువు కింది నుండి కాలువ వెళుతున్నందున గ్రామ చెరువులోకి ఉదయసముద్రం నీటిని లిఫ్ట్ ద్వారా నీటిని నింపాలని రైతులు డిమాండ్ చేశారు.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

● 78వేల మంది భక్తులు రాక ● నిత్యాదాయం రూ.80.11 లక్షలు ● ప్రసాద వితరణకు ఈవో విరాళం





గర్భాలయంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 78వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి తరలివచ్చారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శన క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు రెండు గంటలు, ధర్మదర్శనాలకు నాలుగు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 80,11,461 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు సంప్రదాయరీతిలో నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్టలో స్వామిఅమ్మవారికి నిత్య పూజలు చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. లక్ష్మీనృసింహుడిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తుల ప్రసాద వితరణకు..

భక్తుల ప్రసాద వితరణకు దేవాదాయ కమిషనర్, ఈవో ఎస్. వెంకట్రావు రూ.3లక్షల విరాళం అందజేశారు. కొండపైన ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఈవో దంపతులు రూ.3లక్షల చెక్కును అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మకు అందజేసి మాట్లాడారు. స్వామివారి భక్తులకు ఉచిత ప్రసాద వితరణ నిమిత్తం తాను సర్వీసులో ఉన్నంత కాలం తన వేతనం నుంచి ప్రతి నెల రూ.లక్ష చెల్లిస్తానని తెలిపారు. తాను అందజేసిన విరాళంతో ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీన క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులకు ప్రసాద వితరణ చేయాలన్నారు. తన కుమారుడు దేవజ్‌కుమార్, కుమార్తె మోనిషా కూడా చెరో రూ.లక్ష విరాళం ఇచ్చారని, మొత్తం కలిపి రూ. 3లక్షలు విరాళం ఇచ్చానన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్యకల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారు రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాధికాల భక్తిశ్రద్ధలతో చేశారు. తదుపరి కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేంచేయించి పుణ్యాహవాచనం చేశారు. పాదప్రక్షాళనం మధుపర్క పూజలు చేపట్టారు. అనంతరం మాంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణల అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. వేదపండితులు తూమాటి రామాచార్యులు, బదరీనారాయణచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	511.60 అడుగులు
టీఎంసీలు	136.9932
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	900 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	24.59 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	641.820 అడుగులు
టీఎంసీలు	3.50
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	649.99క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	90.77క్యూసెక్కులు

కథకు పుట్టినిల్లు నల్లగొండ



బర్కతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నల్లగొండ కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు కథకు నల్లగొండ జిల్లా పుట్టినిల్లని, తెలుగు సాహిత్యంలో నల్లగొండ కథ తనదైన ముద్ర వేసిందని సాహితీ వేత్తలు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన రచయిత సాగర్ల సత్తయ్య రచించిన 'బర్కతి' కథా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బర్కత్ సంపుటిలో రచయిత చక్కని శిల్పంతో ఆకట్టుకునే శైలిలో కథలు రాశారని కొనియాడారు. తెలంగాణ సంస్కృతిని గ్రామీణ వాతావరణాన్ని రచయిత కథలు అద్భుతంగా చిత్రికరించారన్నారు. సృజన సాహితీ సంస్థ అధ్యక్షుడు పెరుమాళ్ళ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీ వేత్తలు, కవులు మేరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ కృష్ణ కౌండిన్య, పగడాల నాగేందర్, బైరెడ్డి కృష్ణారెడ్డి, ఎలికట్టే శంకర్‌రావు, ఎంఈవో మేక నాగయ్య, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎడ్ల సైదులు, శీలం భద్రయ్య, బండారు శంకర్, జానకిరామ్, సైదులు, గోవర్ధన్, రవీందర్‌రెడ్డి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు తీపి కబురు!

(5వ పేజీ తరువాయి)



అందనుంది. కేంద్రప్రభుత్వం అమలు చేసే కిసాన్ సమ్మాన్ యోజనతో పాటు ఇతర పథకాలు దక్కాలంటే రైతులు ప్రత్యేకంగా ఆధార్ కార్డు మాదిరిగా భూదార్ కార్డు కోసం వ్యవసాయశాఖను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 5లక్షల మంది వరకు రైతులు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్నారు. ఈ వారంలోనే పీఎం కిసాన్ యో జన రానుండటంతో మిగతా 50శాతం పైగా రైతులు పెద్ద సంఖ్యలో భూదార్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

పెట్టుబడి లేక రైతుల ఇక్కట్లు

ప్రతీ సీజన్‌లో చేతుల్లో పెట్టుబడి నగదు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో ఎకరాకు రూ.5వేల చొప్పున ఏటా రూ.10వేలు పెట్టుబడి సాయంగా రైతుల బ్యాంక్ ఖాతాలో నగదు జమ అయ్యేవి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎకరాకు రూ.7,500 చెల్లిస్తామని హామీ ఇచ్చినా, అధికారంలోకి వచ్చాక నిధుల కొరత పేరుతో ఎకరాకు రూ.6వేల చొప్పున మొత్తం రూ.12వేలు చెల్లిస్తామని ప్రకటించింది. గత ఏడాది పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం గత మాదిరిగానే ఎంత భూమి ఉన్న అంతా మేరకు రైతుల బ్యాంక్ ఖాతాల్లో రైతుభరోసా నగదు జమచేసింది. ఆ తరువాత మాత్రం రైతుభరోసా విషయంలో ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేకపోయింది. ఈ ఏడాది జనవరి 26న మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 72 మండలాల్లోని 72 గ్రామాల్లో రైతుభరోసాను నూటికి నూరుశాతం అమలు చేశారు. ఆ తరువాత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేవలం నాలుగు ఎకరాల వరకే ప్రభుత్వం రైతుభరోసాను విడుదల చేసింది. పెట్టుబడి సాయం అందకపోవడంతో గత యాసంగిలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పూర్తిస్థాయిలో రైతుభరోసా అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు.

సాయం కోసం ఎదురుచూపు

పాలకవీడు: పాలకవీడు మండలంలో 18వేల ఎకరాల మాగాణి, 3వేల ఎకరాల మెట్ట భూములు ఉన్నాయి. యాసంగిలో సన్నధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. అయితే ప్రస్తుతం వానాకాలం సాగు పనుల్లో ఉన్న రైతులకు దీంతో కొంత ఊరట కలిగింది. అయితే ప్రభుత్వం రైతుభరోసా అందజేస్తే పెట్టుబడికి ఇబ్బందులు ఉండవని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. దీనికితోడు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి

కేతేపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రైతు భరోసాకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏవో బి.పురుషోత్తం సూచించారు. జూన్ 5 నాటికి పట్టాదార్ పాసు పుస్తకాలు పొందిన వారు, ఇప్పటి వరకు రైతు భరోసా అందని రైతులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు కొత్తగా దరఖాస్తు చేసే రైతులు దరఖాస్తు ఫారంకు భూమి పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతులు జతచేసి వ్యవసాయ విస్తరణాధికారణ(ఏఈవో)లకు ఇవ్వాలని సూచించారు.

నేడు మాదారం, తక్కళ్లపహాడ్‌లో రెవెన్యూ సదస్సులు

శాలిగౌరారం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదారం, తక్కళ్లపహాడ్ గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు పాస్ పుస్తకాలు తదితర ఆధారాలతో జిరాక్స్ కాపీలు తేవాలని కోరారు.

వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా చర్యలు

● సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్



వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసు కుంటు న్నామని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు. వానాకాలంలో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడి పరిష్కరించేందుకు హెల్ప్‌లైన్‌ను 08682220100 ఏర్పాటు చేసినట్లు చెప్పారు ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు.

ఇంటర్వ్యూ Interview

(ఆంధ్రజ్యోతి-రామగిరి)

ఆంధ్రజ్యోతి : వర్షాకాలంలో ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోబోతున్నారు ?

కమిషనర్ : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు టౌన్-1, టౌన్-2లలో రెస్క్యూ టీంలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ బృందంలో ఎలక్ట్రిషన్, వాటర్ సప్లై, వర్కింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండనున్నారు. అంతేకాకుండా ల్యాడర్ వంటి వాహనం కూడా అందుబాటులో ఉంచుతున్నాం. హెల్ప్ లైన్ కేంద్రంలో ఉద్యోగులు 24గంటలు అందుబాటులో ఉంటారు. ఫిర్యాదు అందిన వెంటనే రెస్క్యూ బృందానికి సమాచారం అందజేస్తారు.

ఆంధ్రజ్యోతి : వరద కాలువలో పూడిక తీత పనులు ఎంత వరకు వచ్చాయి ?

కమిషనర్ : వరద నీరు సాఫీగా వెళ్లడానికి కాలువల్లో పేరుకపోయిన చెత్తచెదారాన్ని తొలగించేందుకు రూ.35 లక్షలకు టెండర్లు పిలిచాం. పనులు కూడా ప్రారంభించాం. భాస్కర్ టాకీస్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్లే రోడ్డు వెంట ఉన్న వరదకాలువల్లో ఉన్న పూడికను తీయిస్తున్నాం. కొన్ని చోట్ల వరద కాలువలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. వాటి స్థానంలో కొత్తగా నిర్మాణం చేపడుతున్నాం. ఇక నీరు రోడ్ల మీదకి వచ్చే పరిస్థితులు ఏ మాత్రం ఉండదు.

ఆంధ్రజ్యోతి : పురాతన భవనాల పరిస్థితి ఏంటి ?

కమిషనర్ : రోడ్డు వెంట కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రమాదకర భవనాలను 60వరకు గుర్తించాం. ఆయా యజమానులకు నోటీసులు కూడా జారీ చేశాం స్వచ్ఛందంగా తొలిగించుకోకపోతే మేమే తొలిగిస్తాం.

ఆంధ్రజ్యోతి : కొందరు రోడ్లు ఆక్రమించి ర్యాంపులు నిర్మిస్తున్నారు. దీనిపై మీ స్పందన ఏంటి ?

కమిషనర్ : రోడ్లను ఆక్రమించి ర్యాంపులు నిర్మాణాలు చేస్తే చట్ట విరుద్ధం. వాటిపై ఫిర్యాదులు చేస్తే వెంటనే తమ సిబ్బందిని పంపి అట్టి నిర్మాణాలను తొలగింపచేస్తాం.

ఆంధ్రజ్యోతి : సీజనల్ వ్యాధులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

కమిషనర్ : వర్షాకాలంలో వచ్చే వైరల్ ఫీవర్, ఇతర వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. ప్రధానంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇకపోతే నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ దోమలు వృద్ధి కాకుండా అయిల్ బాల్స్, మలాథిన్, ఫినాయిల్ వంటి కెమికల్స్‌ను వెయిస్తాం. మలేరియా శాఖ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పనులు చేస్తాం.

ఆంధ్రజ్యోతి : వంద రోజుల ప్రణాళిక పనులు ఎంతవరకు వచ్చాయి ?

కమిషనర్ : జూన్ 2 నుండి వంద రోజుల ప్రణాళిక పనులు అమల్లోకి వచ్చింది. దానిలో భాగంగా 7వ వార్డులో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాం. కుక్కల బెడద ఉందని ఫిర్యాదులు అందిన వెంటనే తమ సిబ్బందిచే కుక్కలను యానిమల్ నియంత్రణ కేంద్రానికి తరలిస్తాం.

ఆంధ్రజ్యోతి : ఆస్తిపన్ను వసూళ్లు ఎలా ఉన్నాయి ?

కమిషనర్ : బకాయిదారులకు డిమాండ్ నోటీసులు పంపిస్తున్నాం. ఆదాయం పెరిగేందుకు పాత భవనాలపై కొత్త నిర్మాణాలు, పాత వాటని విస్తరించి చేపట్టిన నిర్మాణలపై సర్వే చేస్తాం. తద్వారా ఆస్తి పన్ను పెరగనుంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నల్లగొండ పట్టణంలో కలుసుకున్న మమత హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

నల్లగొండ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) నల్లగొండ పట్టణంలోని మమతా హైస్కూల్ 1991-92 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించుకున్నారు. స్థానిక ఐఎంఏ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా ఒక్క చోటకు చేరుకొని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిద్దిన ఉ పాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మమత స్కూల్ కరస్పాండెంట్ యానాల ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎండీ. సలీం, ప్రతాప రెడ్డి, వెంకట్రాంరెడ్డి, దాడి చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, యానాల రాధిక, దొడ్డి రామ్మూర్తి, దాడి సుధాకర్ రెడ్డి, ఊట్కూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు రెడ్డిపల్లి గిరి, నామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపతి యాదయ్య, మహ్మద్ కబీ, ఓర్సు వెంకటేశ్వర్లు, వరంగల్ కృష్ణ, సుభాష్ రెడ్డి, రబ్బానీ, రాజేందర్ రెడ్డి, పెద్ది శ్రీనివాస్, అంశాల సత్యనారాయణ, రజిని, జ్యోతి, నిర్మల, కవిత తదితరులు పాల్గొన్నారు.



పలివెల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

● మునుగోడు రూరల్ : మండలంలోని పలివెల గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన 1990-91 బ్యాచ్ విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోట కలిసి ఆనాటి రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పూల వెంకన్న, గాలి విజయదుర్గ ప్రసాద్, పర్నె శ్రీనివాస్ రెడ్డి, బడు గు వెంకన్న, ముడుపు నర్సిరెడ్డి, ప్రబాకర్ రెడ్డి, పూల శ్రీనివాస్, జెల్లా సత్యం, దోటి భిక్షం, మేకల యాదగిరి, కొండవీటి అనిత, ఉపాధ్యాయులు పర్నే చంద్రారెడ్డి, నవనీతరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో రాజకీయ జోక్యం తగదు



మునుగోడు సమావేశంలో మాట్లాడుతున్న బొల్గూరి నర్సింహ

మునుగోడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల్లో రాజకీయ జోక్యం తగదని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా ఇన్‌చార్జి బొల్గూరి నర్సింహ అన్నారు. స్థానికంలో ఆదివారం నిర్వహించిన డీహెచ్‌పీఎస్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో భాగంగా చేవెళ్ల డిక్లరేషన్ హామీతో పాటు ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని విస్మరించాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను పారిశ్రామిక వర్గాలకు తాకట్టు పెట్టి పేదలకు దక్కాల్సిన రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఈచర్యల ను ప్రజలు గమనిస్తున్నారని సరైనా సమయంలో ప్రజావ్యతిరేక ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు యాదయ్య, కుమార్, చంద్రయ్య, నగేష్, మారయ్య, నరేష్, ముత్తయ్య, శివయ్య, ముత్తయ్య, దుబ్బ వెంకన్న పాల్గొన్నారు.

లక్ష్మయ్య మృతికి పలువురు నివాళి

కనగల్, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోరెపల్లి గ్రామానికి చెందిన కొమ్మగోని లక్ష్మయ్య(70) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ కిసాన్‌సెల్ కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భైరగోని శేఖర్‌గౌడ్, వేమిరెడ్డి రవీందర్‌రెడ్డి, మారగోని సైదులు, శంకర్‌గౌడ్, శ్రీను, విజయ్, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

బడిబాటపై వినూత్న ప్రచారం

(ఆంధ్రజ్యోతి - చిట్యాలరూరల్)

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట విజయవంతం చేయడానికి మండలంలోని పెద్దకాపర్తి గ్రామస్తులు వినూత్న ప్రచారం చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్య వేల రూపాయలతో కూడుకున్న ఖర్చు అదే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యతో పాటుగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం అందుతుందని ఉపాధ్యాయులు ఓవైపు ప్రచారం చేపడుతున్నారు. అయితే ఇం దుకు సహకారంగా గ్రామస్తులకు సులువు గా అర్థమయ్యేలా ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా నాణ్యమైన విద్య లభిస్తుందని వాట్సాప్ గ్రూపులో ప్రచారం చేస్తున్నారు.



ఆ గట్టునేమో 25 వేలు ఖర్చు ఉంది		ఈ గట్టునేమో నాణ్యమైన ఉచిత విద్య ఉంది	
స్కూలు ఫీజు	10000	స్కూలు ఫీజు	ఉచితం
టెక్ట్ బుక్స్	1000	టెక్ట్ బుక్స్	ఉచితం
నోట్ బుక్స్	500	నోట్ బుక్స్	ఉచితం
భోజనం	5000	భోజనం	ఉచితం
యూనిఫారం	2000	యూనిఫారం	ఉచితం
బస్సు/ఆటో	5000	బస్సు/ఆటో	అవసరం లేదు
ఇతరములు	1500	ఇతరములు	ఉచితం

వాట్సాప్ గ్రూప్‌లో పోస్టింగ్ ఇలా..

ఏబీవీపీ కన్వీనర్‌పై దాడి అమానుషం



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

నల్లగొండ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్‌పై దాడికి పాల్ప డడం అమానుషమని ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి చౌహన్ అన్నారు. స్థానిక ఏచూరి శ్రీనివాస్ స్మారక భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్యపై గుర్తు తెలియని దుండగులు దాడి చేయడం పిరికి పంద చర్య అని అన్నారు. ఏబీవీపీ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి దాడికి పాల్పడుతున్నారన్నారు. స్వయాన రాష్ట్ర మంత్రి ఇలాఖలో ఈ దాడి జరగడం చాలా దౌర్భాగ్యమని దాడి జరిగి 3 రోజుల అయిన కానీ పోలీసులు నిందితులను గుర్తించకుండా పబ్బం గడుపుతున్నారన్నారు. ఈ దాడి వెనక ఉన్న దుండగులను గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రానున్న రోజుల్లో ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తామని వారన్నారు. కార్యక్రమంలో స్టేట్ యూనివర్సిటీ కో కన్వీనర్ మౌనేశ్వర్‌చారి, జిల్లా నాయకులు సంపత్, యూనివర్సిటీ అధ్యక్షుడు హనుమాన్, కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

టీడీపీ మండల, పట్టణ కార్యవర్గాల ఎన్నిక

నల్లగొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నల్లగొండ నియోజకవర్గంలోని పట్టణ, మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఎల్వీయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ పట్టణాధ్యక్షుడిగా గుండు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గోగుల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా భూతం వెంకటయ్య, కోశాధికారిగా కిషోర్‌ను ఎనుకున్నారు. నల్లగొండ మండలాధ్యక్షుడిగా బక్కతోళ్ల ఇస్తారి, ప్రధాన కార్యదర్శిగా గుత్తా శంకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశం ఎన్నికయ్యారు. కనగల్ మండలాధ్యక్షుడిగా మహేశ్వరం సాయిరాం, ప్రధాన కార్యదర్శిగా ఆరెళ్ల కొండల్, తిప్పర్తి మండలాధ్యక్షుడిగా దొంతినేని నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా నూకల గోవర్ధన్, పట్టణ మహిళా అధ్యక్షురాలిగా మంజులను ఎన్నుకున్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లయ్యకు సన్మానం



కొండేటి మల్లయ్యను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లగొండ్ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన కొండేటి మల్లయ్యకు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కత్తుల తులసీదాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కత్తుల ఎల్లయ్య, కత్తుల సైదులు, తలకొప్పుల గిరి, మేడి సురేందర్, కత్తుల అంబేద్కర్, దాసరి లక్ష్మణ్, కత్తుల దొరబాబు ఉన్నారు.

దైద రవీందర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



దైద రవీందర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ కేతేపల్లి మండల నాయకులు

కేతేపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన దైద రవీందర్‌ను కాంగ్రెస్ మండల నాయకులు ఆదివారం నకిరేకల్‌లోని ఆయన నివాసం అభినందించారు ఈ సందర్భంగా వారు దైద రవీందర్‌ను శాలువాలు, పూలమాలలో సన్మానించారు. సన్మానించిన వారిలో బండపాలెం గ్రామ మాజీ సర్పంచ్ వంగూరి రాము, చెరుకుపల్లికి చెందిన పెదబొస్కసాగర్ ఉన్నారు.

శివలీలారెడ్డికి మంజీరా అవార్డు

కనగల్, జూన్15:(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కంబాల శివలీలారెడ్డికి మంజీరా అవార్డును ప్రదానం చేశారు. తెలుగు కళారత్నాల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ త్యాగరాయగాన సభ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ ఎంవీ రత్నం, డాక్టర్ దానశి ఉషారాణి ఓంకార్, డాక్టర్ శ్రీనివాస్ అవార్డు అందజేశారు. ఈసందర్భంగా శివలీలారెడ్డి మాట్లాడుతూ అవార్డును అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జగదీశ్వర్‌రావ్, ఎం.విజయలక్ష్మి, హరికుమార్, నరేష్, ప్రసన్న, మాలతి తదితరులున్నారు.



అవార్డు స్వీకరిస్తున్న శివలీలారెడ్డి

వల్లభరావు చెరువులో ఆక్రమణలే లేవట?

(5వ పేజీ తరువాయి)



వల్లభరావు చెరువు సమీపంలో ఇంటి నిర్మాణం

అధికారులు పరిశీలించడంతో పాటు ఆక్రమణలు వాస్తవమేనని సైతం పేర్కొన్నారు. రెండు ఏళ్ల క్రితం అప్పటి నీటిపారుదలశాఖ ఏఈఈ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు చెరువును సందర్శించి ఆక్రమణలు పెద్దమొత్తంలో జరిగాయని, ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ జోన్‌లో ప్రీకాస్ట్ ఇటుకులతో ప్రహరీను అక్రమంగా నిర్మించారని తేల్చి సర్వే కూడా చేశారు. అనంతరం ఆక్రమణలపై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైనప్పుడు చెరువులోని నిర్మాణాలను కూల్చి హద్దులను ఏర్పాటు చేశారు. తిరిగి కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలను చేస్తున్నారు. గతంలో ఆక్రమణలు కూల్చి వేసిన అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. తిరిగి ఆక్రమణలు కొనసాగడం చూస్తుంటే కొందరు తెరవెనుక తతంగాన్ని నడిపిస్తుండటం వల్లే అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రెవెన్యూ అధికారులు మొక్కుబడి సర్వే చేసి ఎలాంటి ఆక్రమణలు జరగలేదని నివేదిక ఇచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. గతంలో ఉన్న చెరువు హద్దులు చెరువులోకి వెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువు శిఖానికి హద్దులు ఏర్పాటు చేయడంతోపాటు ఫెన్సింగ్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదలశాఖ డీఈఈ సతీష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా వల్లభరావు చెరువు ఎలాంటి ఆక్రమణలకు గురికాలేదని రెవెన్యూశాఖ నివేదిక ఇచ్చిందని తెలిపారు.

ఇంకా నివేదిక ఇవ్వలేదు

తహసీల్దార్ చెప్పిన వెంటనే సర్వే చేశా. నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిలోని హైవే సర్వే ఉండటంతో అదే రోజు వల్లభరావు చెరువు సర్వే కూడా పూర్తిచేశా. అయితే ఇంకా నివేది క ఇవ్వలేదు. చెరువు శిఖానికి సంబంధించి 86 ఎకరాలను సర్వే చేయగా, ఎలాంటి ఆక్రమణలకు గురికాలేదు. -సైదులు, సర్వేయర్, నల్లగొండ

ఉన్నతాధికారులకు తెలియజేశాం

వల్లభరావు చెరువులో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని సర్వేయర్ తెలిపాడు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఆర్డీవోకు కూడా వివరాలు అందించాం. నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి హద్దురాళ్లను పాతుతాం. ఇదే విషయాన్ని సంబంధితశాఖకు తెలిపాం. ఈనెల 21న జరిగే నీటిపారుదలశాఖ మీటింగ్‌లో దీనిపై నిర్ణయం తీసుకుంటాం. - హరిబాబు, తహసీల్దార్, నల్లగొండ

కులవివక్షను రూపుమాపాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

చిట్యాల, జూన్15, (ఆంధ్రజ్యోతి) :కులవివక్ష రూపుమాపడానికి అందరూ కృషి చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వంటిపాక కృష్ణ కోరారు. ఈ నెల 22, 23 తేదీల్లో కట్టంగూర్‌లో నిర్వహించే కేవీపీఎస్ రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆదివారం చిట్యాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ శిక్షణ తరగతులకు పెద్ద సంఖ్యలో హా జరై విజయవంతం చేయాలని కోరారు. జిట్ట నగేష్, బొడ్డు బాబురావు, గాదె ఎల్లేష్, బరాల యాదగిరి, పాల రమేష్, భీంపాక నర్సింహ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

శాలిగౌరారం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ అన్నారు. మండలకేంద్రం లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఎమ్మెల్యే మందుల సామేలు ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. శాలిగౌరారం మండల వ్యాప్తంగా సుమారు 6,506 మంది రైతులకురూ. 54కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రైతు భరోసా, అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే మందుల సామేల్‌పై కొంత మంది అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. గతంలో ఏ సంక్షేమ పథకమైన బీఆర్ఎస్ వాళ్లకి వచ్చేదని నేడు పార్టీలకతీతంగా రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం

● సైదానాయక్, ఎంఈవో, చిట్యాల



చిట్యాల మండలంలో పాఠశాలలకు అనుమతులు, విద్యార్థులు సంఖ్య, విద్యాసంస్థల్లో తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై ఎంఈవో పానుగోతు సైదానాయక్ 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు.

ఇంటర్వ్యూ Interview

(ఆంధ్రజ్యోతి-చిట్యాల రూరల్)

ఆంధ్రజ్యోతి: చిట్యాల మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి? ఎంత మంది విద్యార్థులు ఉన్నారు.?

ఎంఈవో: మండలంలో 21 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇవికాకుండా మరో మూడు మూతపడ్డాయి. ఆరు ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 జడ్పీహెచ్ఎస్ ఉన్నాయి. ఈ పాఠశాల్లో సుమారు 2706మంది విద్యార్థులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలోని విద్యార్థులందరికీ యూనిఫారాలు వచ్చాయా?

ఎంఈవో: విద్యార్థులందరికి ఒక్కో జత యూనిఫాం వచ్చింది. మరో జతకు వస్త్రం వచ్చింది.

ఆంధ్రజ్యోతి: పాఠ్యపుస్తకాలు ఎన్ని వచ్చాయి.? నోట్ బుక్స్, వర్క్ బుక్స్ వచ్చాయా?

ఎంఈవో: ఇండెంట్ ప్రకారం హైస్కూళ్లకు పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ అన్నీ వచ్చాయి. వర్క్ నోట్‌బుక్కులు ప్రాథమికోన్నత పాఠశాలకు, జెడ్పీహెచ్ఎస్‌కు ఇండెంట్ ప్రకారం వచ్చాయి. ప్రాథమిక పాఠశాలకు ఈవారంలో వస్తాయి.

ఆంధ్రజ్యోతి: బడిబాట కొనసాగుతుందా? కొత్తగా ఎన్ని అడ్మిషన్లు వచ్చాయి?

ఎంఈవో: మండలంలో బడిబాట కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీ వరకు కొత్తగా 169మంది విద్యార్థుల జాయిన్ అయ్యారు ఈ సంఖ్య ఇంకా పెరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారా?

ఎంఈవో: మండలంలో ఏడుగురు ఉపాధ్యాయులు అదనంగా ఉన్నారు. జూలై 15వ తేదీ వరకు సర్దుబాటుకు అవకాశం ఉంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సర్దుబాటుకు ఎంఈవో అనుమతి కావాలి. విద్యార్థుల సంఖ్య పెరిగితే ఉపాధ్యాయులు అదనంగా కావాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో ప్రైవేటు పాఠశాలలు ఎన్ని ఉన్నాయి? వాటికి అనుమతులు ఉన్నాయా?

ఎంఈవో: మండలంలో 17 ప్రైవేటు పాఠశాలలున్నాయి. అన్నిటికీ అనుమతులున్నాయి.

ఆంధ్రజ్యోతి: అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎన్నిటికి ఎంపిక చేశారు? పనులు పూర్తయ్యాయా?


ఎంఈవో: మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక య్యాయి. అన్నిటిల్లో పనులు పూర్తయ్యాయి. చిట్యాల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో బిల్లులు రాక కొన్ని పనులు ఆగాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో మన ఊరు-మనపాఠశాల పథకంలో పనులు జరిగాయా?

ఎంఈవో: మండలంలో మన ఊరు-మనబడి పథకంలో 75శాతం పనులు పూర్తయ్యాయి. బిల్లులు రానందున 25శాతం పనులు ఆగాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం ఉందా?

ఎంఈవో: అన్ని పాఠశాలలకు మిషన్ భగీరథ ద్వారా కృష్ణాజలాల సౌకర్యం ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను నాణ్యమైన విద్య లభించే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి సహకరించి సద్వినియోగం చేసుకోవాలి.




చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.5
కనిష్ఠం	24.4

ఆ గ్రామాల్లో


ఇందిరమ్మ ఇళ్లు లేనట్లేనా!

- నిడమనూరు, సూరేపల్లి, ఎర్రబెల్లి, వల్లభాపురం గ్రామాలకు ఇళ్లు నిల్
- అర్హుల జాబితా సకాలంలో అందకపోవడమే కారణం

8



ఆధ్యాత్మికతకు ఆలవాలం



సూర్యాపేట జిల్లా అర్వపల్లి ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్నది. 12వ శతాబ్దం నుంచి చరిత్ర కలిగిన దేవాలయాలు జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో నేటికీ విరాజిల్లుతున్నాయి. గుట్టల మధ్యన దేవాలయాలు చూసేందుకు చూడముచ్చటగా ఉన్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తూ మొక్కు చెల్లించుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-అర్వపల్లి)

6

పని బంగారం.. బతుకు నిస్సారం




కులవృత్తుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో వాటిపై ఆధార పడి న వారు బతుకు దారి మార్చుకుంటున్నారు. మరికొందరు ఇప్పటికీ తాతల కాలం నుంచి వారసత్వం గా స్వీకరించి స్వర్ణకార వృత్తినే నమ్ముకుంటూ నానా యాతన పడుతున్నారు. పని బంగారం.. కాని బతుకే నిస్సారంగా మారిందని స్వర్ణకారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి- రామగిరి)

6

ఉద్యాన విద్య.. ఉజ్వల భవిత



ఏటా వాతావరణంలో కలుగుతున్న అసమతుల్యత కారణంగా తక్కువ నీటి వనరుల వినియోగంతో పంటల సాగుపై రైతులు దృష్టిసారిస్తున్నారు. అందులో ఉద్యాన పంటలు ముందు వరుసలో ఉంటున్నాయి. ఈ రంగంలో ఉపాధి అవకాశాలూ పెరుగుతుండటంతో యువత కోసం ప్రభుత్వం రెండేళ్ల డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టింది.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ వ్యవసాయం)

7

నేడు రైతులతో సీఎం ముఖాముఖి

వీడియో కాన్ఫరెన్స్‌కు రైతువేదికల్లో ఏర్పాట్లు



నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం రైతువేదికలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఈవో విజయలక్ష్మి

నల్లగొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. 16న మధ్యాహ్నం క్యాబినెట్ సమావేశం అనంతరం సాయంత్రం 3గంటలకు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడనున్నారు. అందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 72 రైతు వేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ సామగ్రి అమర్చగా, తాజా మరో 142 రైతు వేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ అందుబాటులోకి వచ్చింది. ఈ వీడియోకాన్ఫరెన్స్ వ్యవస్థ ద్వారా రైతులకు రైతు నేస్తం' కార్యక్రమాలు ప్రసారం కానున్నాయి. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సాగులో నూతన యాజమాన్య విధానాలు, ఆధునిక సాంకేతికత, యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. కాగా, సీఎం ముఖాముఖికి ఒక్కో రైతు వేదికలో 250 మం ది రైతులకు తగ్గకుండా పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా ఒక్కో రైతు వేదికలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాస్థాయి, డివిజన్‌స్థాయి, మండలస్థాయి అధికారులు సైతం హాజరుకానున్నారు. నల్లగొండ జిల్లాలోని చింతపల్లి మండలంలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరవుతారని జేడీఏ శ్రవణ్‌కుమార్ తెలిపారు. వీసీలు ఉన్న రైతు వేదికల వద్దకు రైతులు సకాలంలో చేరుకొని ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షించాలని ఆయన కోరారు.

అన్నదాతలకు తీపి కబురు!

వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రైతులకు తీపి కబురు చెప్పే అవకాశాలు ఉన్నాయి. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ రానుండటం, పల్లెలతో ముడిపడి ఉన్న ఎన్నికలు కావడంతో రైతుభరోసాను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈనెల 16న మధ్యాహ్నం క్యాబినెట్ మీటింగ్‌తో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఎం నిర్ణయం ప్రకటిస్తారని రైతులంతా ఎదురుచూస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



అప్పు తెచ్చి వ్యవసాయం

చేస్తే వడ్డీలకే సరి



ఎరువులు, విత్తనాలు, ట్రాక్టర్ల కిరాయిలు, కూలీల ఖర్చులు బాగా పెరిగిపోయాయి. దీంతో సాగు పనులకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు తెస్తున్నా. వ్యవసాయం చేస్తే వచ్చే మొత్తం వడ్డీలకే సరిపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వానాకాలం సీజన్ ఆరంభానికి ముందే బ్యాంకులద్వారా రుణాలు, రైతుభరోసా సహాయం అందించాలి.

- కమలాకర్, రైతు, పాలకవీడు

» రైతు భరోసాపై చిగురిస్తున్న ఆశలు » సాగు భూమి అంతటికీ పెట్టుబడిసాయం » స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రభుత్వం నిర్ణయం » 20న పీఎం కిసాన్ యోజన సైతం

స్థానిక సంస్థల్లో భాగమైన జిల్లాపరిషత్, మండల పరిషత్ పాలకవర్గాల ఎన్నికల అనంతరం గ్రామ పంచాయతీలకు సర్పంచ్, పట్టణాలకు మునిసిపల్ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో రైతుభరోసా సాయం మంజూరుపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. గత యాసంగిలో కేవలం నాలుగు ఎకరాల వరకే ప్రభుత్వం రైతుభరోసా నగదును రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. దీంతో మిగతా రైతులంతా నిరుత్సాహం చెందారు. అయితే ఈసారి రైతుభరోసా కోసం పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చుకొని ఎకరాలతో నిమిత్తం లేకుండా అందరి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు చర్చ సాగుతోంది.

ఉమ్మడి జిల్లాలో 11.56లక్షలకు పైగా పట్టాదారులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 21.50లక్షల ఎకరాలకు పైగా సాగు భూమి ఉండగా పట్టాదారులు 11,56,800 మంది వరకు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5,65,788 మంది పట్టాదారులు, యాదాద్రి జిల్లాలో 2,84,250 మంది, సూర్యాపేట జిల్లాలో 3,06,760 మంది పట్టాదారులు ఉన్నారు. వీరందరి బ్యాంకు ఖాతాల్లో రైతుభరోసా నగదు జమ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సాగుచేసే భూమి అంతటికీ పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రభుత్వం ఏ మేరకు రైతుభరోసా ఇస్తుందనే దానిపై ఓ నిర్ణయానికి రాకపోవడంతో ప్రతీ సీజన్‌లో రైతులు ఆందోళనకు గురయ్యారు. గత ప్రభుత్వం రైతుల పాస్‌బుక్‌లో ఎంత భూమి ఉంటే అంత రైతుబంధు నగదును జమచేసింది. దీంతో గుట్టలు, వెంచర్ భూములకు సైతం పెట్టుబడి సాయం అందిందని నాడు కాంగ్రెస్ నాయకులు ఆందోళనలు నిర్వహించారు. గతం ప్రభుత్వ హయాంలో ప్రజాధనం వృథా అయిందని భావించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో డివిజన్ల వారీగా రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ చేసింది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఇప్పటికీ ఎన్ని ఎకరాలకు పెట్టుబడి సాయాన్ని చెల్లిస్తారనేదానిపై స్పష్టత లేదు. గత రెండు రోజులుగా మాత్రం సాగు చేసే భూమి మొత్తానికి ఈ వారం రోజుల్లోపై రైతుభరోసా చెల్లిస్తామని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుందనే వార్తలు రావడంతో రైతుల్లో ఆశలు పెరిగాయి.

పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ఈ వారంలోనే...

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ యోజనకు సంబంధించిన పెట్టుబడి సాయం నగదు ఈ వారంలోనే రైతులకు అందనుంది. ఈ నెల 20వ తేదీన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే పీఎం కిసాన్ సమ్మాన్ యోజన సాయం రైతుల ఖాతాలో జమకానున్నాయి. ప్రతీ రైతు ఖాతాలో రూ.2వేలు జమ చేయనున్నారు. ఇన్‌కంట్యాక్స్(ఐటీ) చెల్లిస్తున్న రైతులకు మినహా, ఇతర సన్న, చిన్నకారు రైతులకు ఈ సాయం

- మిగతా 7వ పేజీలో...

వల్లభరావు చెరువులో ఆక్రమణలే లేవట?

చెరువు సర్వేలో గోల్‌మాల్



- శిఖం అన్యాక్రాంతం కాలేదని తప్పుడు నివేదిక
- అసలు సర్వే చేశారా అనే అనుమానాలు
- గతంలో ఆక్రమణకు గురైదని పోలీసులకు అధికారుల ఫిర్యాదు
- ప్రస్తుతం అంతా సరేనంటూ రెవెన్యూశాఖ బుకాయింపు
- వత్తాసు పలుకుతున్న నీటిపారుదలశాఖ అధికారులు

నల్లగొండ పట్టణంలోని వల్లభరావు (బతుకమ్మ కుంట) చెరువు భూమి ఎలాంటి ఆక్రమణలకు గురికాలేదని రెవెన్యూ అధికారులు నివేదికను రూపొందించడంపై పలు ఆరోపణలు వినవవస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 8న వల్లభరావు చెరువు ఆక్రమణపై కథనం ప్రచురించగా, ఆక్రమణదారులు ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

'ఆంధ్రజ్యోతి' కథనం అనంతరం ఆక్రమణల విషయాన్ని తేల్చాలని నల్లగొండ మండల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించాలని సర్వేయర్‌కు బాధ్యతలు అప్పగించారు. సదరు సర్వేయర్ చెరువు సర్వేను మమ అనిపించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారికి సర్వే చేస్తున్న సమయంలోనే వల్లభరావు చెరువును సర్వే చేశానని సదరు సర్వేయర్ పేర్కొంటుండగా, కేవలం 10 నుంచి 20 నిమిషాల్లో 86 ఎకరాల వల్లభరావు చెరువును ఎలా సర్వే చేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీని వెనక కొందకు చక్రం తిప్పి అధికారులతో కుమ్మక్కై ఎలాంటి ఆక్రమణలు జరగలేదని నివేదిక ఇచ్చేలా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గతంలో ఉన్న హద్దులను సైతం చెరిపేసి ప్రహరీలు నిర్మించి గేట్లను ఏర్పాటు చేసుకున్నట్టు బహిరంగంగా కన్పిస్తుండగా, గతంలో ఆక్రమణ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఆ తరువాత నీటిపారుదలశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో తిరిగి యథావిధిగా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. పక్కన సర్వే నెంబర్‌లో చెరువు శిఖం భూమిని చూపిస్తూ తప్పుడు పత్రాలు సృష్టించి కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారు. సుమారు 86ఎకరాలు కలిగిన చెరువు శిఖం ఆక్రమణలకు గురైంది. మూడేళ్ల క్రితం వల్లభరావు చెరువు ఆక్రమణకు గురికావడంతో పోలీసుబందోబస్తు మధ్య అధికారులు ఆక్రమణలను తొలగించడమేగాక, హద్దులను కూడా నిర్ణయించారు.

మళ్లీ ఆక్రమించినా పట్టించుకోని అధికారులు

ఆక్రమణలు కొంతకాలం సద్దుమణిగినా మళ్లీ కొద్ది రోజులుగా చెరువు శిఖాన్ని ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. ఎలాంటి కాగితాలు లేకున్నా కొత్తగా సృష్టించి ప్రహరీలు నిర్మిస్తున్నారు. చెరువు శిఖంలో నీటిపారుదలశాఖ అధికారులు గతంలో హద్దులు నిర్ణయించి దిమ్మెలు నిర్మించారు. ప్రస్తుతం ఆ దిమ్మెలు నామరూపాలు లేకుండా పోయాయి. దీంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా చెరువు శిఖాన్ని కబ్జా చేస్తున్నారు. శిఖంలో హద్దులు దాటివచ్చి ప్రహరీలు నిర్మించడమేగాక మట్టి పోసి చదును చేశారు. కోట్ల రూపాయల విలువచేసే భూమి అన్యాక్రాంతం అవుతున్నా అటు రెవెన్యూ,ఇటు నీటిపారుదలశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.ఇటీవల సర్వే నిర్వహించారా? లేదా?అనే విషయంపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం కాగితాలపైనే తప్పుడు నివేదిక అందజేసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది.

అప్పుడు ఆక్రమణలు, ఇప్పుడు సక్రమం ఎలా?

గతంలో వల్లభరావు చెరువును నీటిపారుదలశాఖ..

- మిగతా 8వ పేజీలో...

ప్రజలకు అండ సీపీఐ జెండా

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

పెద్దవూర, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉద్యమాలే ఊపిరిగా ప్రజలకు అండగా సీపీఐ జెండా నిలబడి పోరాడుతోందని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మండలంలోని పులిచర్ల గ్రామంలో జరిగిన సీపీఐ మహాసభలో ఆయన మాట్లాడారు. ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజా ఉద్యమాలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సీపీఐ అని అన్నారు. బడుగు, బలహీనవర్గాలను ఏకం చేసి రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన సీపీఐ నాయకత్వ వహించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు.

నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదల నడ్డివిరిచేలా వంట గ్యాస్ ధరలు పెంచిందన్నారు. పంటకు గిట్టుబాటు ధర, ఎరువులు, విత్తనాలను సబ్సిడీతో ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భిక్షంరెడ్డి, మండల కార్యదర్శి గడ్డంపల్లి భిక్షం రెడ్డి, నాయకులు పొదిల నరసింహ, లక్ష్మీపతి, రొయ్య రాములు, శోభన్‌బాబు, నాగార్జున, జయప్రకాశ్‌రెడ్డి, విజయానంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విజయాలను ప్రచారం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం



నార్కట్‌పల్లి సమావేశంలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లలో సాధించిన విజయాలను పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎంతో ముందడుగు వేస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా దేశం కీర్తి ప్రతిష్టలు పెరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృది, సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీని గ్రామస్థాయిలో పటిష్ఠం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్, నకిరేకంటి మొగులయ్య, పజ్జూరి వెంకట్‌రెడ్డి, పాల్వాయి భాస్కర్‌రావు, శంకర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ ఫిలిం అవార్డ్స్ జ్యూరీ సభ్యుడిగా మధు

మిర్యాలగూడ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్సులో మిర్యాలగూడ పట్టణవాసి వాకిటి మధు జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటి వెంకట్‌రెడ్డి నుంచి జ్యూరీ సభ్యుడిగా మధు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ అవార్డుల ఎంపిక కమిటీలో జ్యూరీ సభ్యుడిగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మెమొంటో అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటి వెంకట్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా, జ్ఞాపిక అందుకున్న మధును పట్టణ ప్రముఖులు అభినందించారు.



మెమొంటో అందుకుంటున్న వాకిటి మధు

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి : ఏవో

అడవిదేవులపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ప్రభుత్వం అందించే రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో సరిత ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లను దరఖాస్తు ఫారంతో జతచేసి ఈనెల 20లోపు ఏఈఓలకు అందించాలని అన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

చింతపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎండీ మజహర్‌అలీబేగ్(పాషా) కోరారు. ఆదివారం ఆయన మాట్లాడారు. డ్రైనేజీ నిండడంతో రోడ్డుపై మురుగు పారుతుందన్నారు. మురుగు కాల్వలలో పైపుల పరిమాణం తక్కువగా ఉండటంతో మురికినీరు బయటకు వస్తుందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు.

ఆ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు లేనట్లేనా..!

పేదోడి సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పథకం అమలులో భాగంగా సొంత స్థలం కలిగిన వారికి ఇల్లు నిర్మించుకునేందుకు దశలవారీగా ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వనుంది. ఇందుకోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను కూడా చేపట్టింది. కానీ నిడమనూరు మండలంలోని నాలుగు గ్రామాలు మాత్రం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నోచుకోవడం లేదు.



- నిడమనూరు, సూరేపల్లి, ఎర్రబెల్లి, వల్లభాపురం గ్రామాలకు ఇళ్లు నిల్
- అర్హుల జాబితా సకాలంలో అందకపోవడమే కారణం
- ఇళ్ల మంజూరు కోసం పేదల ఎదురుచూపులు

– (ఆంధ్రజ్యోతి నిడమనూరు)

మండలంలోని ఆ నాలుగు గ్రామాల్లో ఈ ఏడా ది ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరగదు. లబ్ధిదారులు ఏడాది వరకు ఎదురుచూడాల్సిందేనని అధికారులు అంటున్నారు. మండలంలోని నిడమనూరు, సూరేపల్లి, ఎర్రబెల్లి, వల్లభాపురం గ్రామాల్లోని అర్హుల జాబితా ఉన్నతాధికారులకు సకాలంలో అందకపోవడంతో ఆయా గ్రామాల్లో ఈ ఏడాది ఇళ్ల మంజూరు కావడం లేదు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక యాప్ ద్వారా పేదలను గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. కానీ అధికార పార్టీ నాయకులు ఏప్రిల్ 30 వరకు కూడా అర్హుల జాబితాను అందించలేకపోయారు. సకాలంలో జాబితా చేరకపోవడంతో నాలు గు గ్రామాలకు కలెక్టర్ అనుమతి రాలేదు. నిడమనూరుకు 50, సూరేపల్లికి 15, ఎర్రబెల్లికి 25, వల్లభాపురం గ్రామానికి 38 ఇళ్లు ఇవ్వాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ప్రతిపాదన చేసినప్పటికీ, ఆయా గ్రామాల్లోని నాయకుల్లో సమన్వయం లేకపోవడం వంటి తదితర కారణాలతో సకాలంలో అధికారులకు జాబితా ఇవ్వలేకపోయారు.

నిలిచిన మొదటి విడత మంజూరు

దీంతో ఆ నాలుగు గ్రామాల్లో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిలిచిపోయింది. కానీ తమకు ఇళ్లు మంజూరవుతాయనే ఆశతో లబ్ధిదారులు ఉన్నారు. మంజూరుపత్రం రాగానే ఇళ్ల నిర్మా ణం ప్రారంభించాలని ఎదురుచూస్తున్నారు. కాగా మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో అనేక మం ది ఆశావహులు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ 771 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగింది. గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించినప్పటికీ ఇంకా ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని తుమ్మడం గ్రామా న్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి 260 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. కానీ ఇందులో 100 మంది లబ్ధిదారుల వరకే కుదించే అవకాశం ఉన్న ట్లు తెలిసింది. గ్రామంలో 69 మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఇందులో 29 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసి మొదటి విడత బిల్లు కోసం ఎదురు చూస్తున్నారు.

నేడు బంగారు మైసమ్మ ఆలయంలో విక్రయ హక్కుకు వేలం

దామరచర్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లి గ్రామంలో కొలువై ఉన్న బంగారు మైసమ్మ తల్లి ఆలయం వద్ద కొబ్బరికాయలు, లడ్డూ ప్రసాదం, పూలదండలు, నిమ్మకాయలు విక్రయించడానికి, దున్నపోతులు, కొబ్బరి చిప్పలు, తలనీలాలు సేకరించుకునే హక్కు కోసం సోమవారం ఉదయం 11గంటలకు ఆలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి ఆదివారం తెలిపారు. జూలై 2025 నుంచి జూన్ 2026 వరకు కొబ్బరికాయలు అమ్ముకునే హక్కుకు రూ.లక్ష దున్నపోతులు సేకరించుకునే హక్కుకు రూ.లక్ష, పూలదండలు, నిమ్మకాయలు విక్రయించే హక్కుకు రూ.50వేలు, కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కుకు రూ.50 వేలు, తలనీలాలు సేకరించుకునే హక్కుకు రూ.50వేలు, లడ్డూ ప్రసాదం అమ్ముకునే హక్కుకు రూ. లక్ష డిపాజిట్ చెల్లించాలన్నారు.

నేడు సీఎంతో వీడియోకాన్ఫరెన్స్

చింతపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రైతువేదిక వద్ద సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో వీడియోకాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏవో శ్రవణి కుమారి ఆదివారం తెలిపారు. రైతు భరోసా నిధుల గురించి మాట్లాడుతారని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

● అంజయ్య, మండలవిద్యాధికారి, చింతపల్లి



ఇంటర్వ్యూ Interview

కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని మండల విద్యాధికారి నేరడు అంజయ్య తెలిపారు. ఈ ఏడాది పాఠశాల పునః ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ యూనిఫామ్ అందించినట్లు చెప్పారు. ఆదివారం'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.
(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

ఆంధ్రజ్యోతి: మండలంలోని విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పూర్తి స్థాయిలో పంపిణీ చేశారా ?

ఎంఈవో : మండలంలో 45 పాఠశాలల్లో 4,560 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు దుస్తులు అన్నీ పాఠశాలలకు చేరాయి. దాదాపుగా 80 శాతం విద్యార్థులకు అందజేశాం.

ఆంధ్రజ్యోతి: ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలు పాటిస్తున్నారా ?

ఎంఈవో: మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. వాటిని ఉల్లంఘించి పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తులు విక్రయిస్తే పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలు పాటించని వాటిని సీజ్ చేస్తాం

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందా?

ఎంఈవో: ఇటీవల ఉపాధ్యాయ బదిలీలు జరగడంతో ఖాళీల కొరత తగ్గింది. తక్కువ విద్యార్థులు ఉన్న చోటు నుంచి ఉపాధ్యాయులను ఎక్కువ మంది విద్యార్థులున్నా పాఠశాలలకు పంపించి బోధన చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఫిట్‌నెస్ లేకుండా బస్సులున్నాయా... వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

ఎంఈవో: ప్రైవేట్ పాఠశాలలో ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపితే రూ. రూ. 5000జరిమానా విధిస్తాం. ప్రథమ చికిత్స కిట్లు, పుట్‌బోర్డు సక్రమంగా లేకుండా అదనంగా జరిమానా విధిస్తాం. ప్రభుత్వ ఆదేశాలతో రద్దు చేసే అవకాశం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు అల్పాహార పథకం కొనసాగుతుందా?

ఎంఈవో: ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం కొనసాగించే అంశం ప్రభుత్వ పరిధిలో ఉంది.

దేవరకొండకు నిలిచిన కృష్ణాజలాల సరఫరా

» సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయంటున్న అధికారులు » వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్న కాలనీల వాసులు

దేవరకొండ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణానికి వారం రోజులుగా కృష్ణాజలాల సరఫరా నిలిచిపోయింది. కోదండాపురం ప్లాంట్ వద్ద సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కృష్ణాజలాల సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలుపుతున్నారు.వారం రోజులుగా పట్టణంలో కృష్ణాజలాల సరఫరా నిలిచిపోవడంతో పట్టణ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వేసవి ముగిసిన తరువాత వర్షాకాలం ప్రారంభంలో నీటిసమస్య ఏర్పడిందని, అధికారులు పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. దేవరకొండ పట్టణంలో 20 వార్డులకు 50 వేలకుపైగా జనాభా ఉంది. పట్టణంలో 8,489 మిషన్‌భగీరథ నల్లాల కనెక్షన్లు ఉన్నాయి. ప్రతిరోజు 43 లక్షల లీటర్ల నీటిని పట్టణానికి సరఫరా చేస్తున్నారు. హనుమాన్‌నగర్, చంద్రన్నకాలనీ, తాటికోల్ రోడ్డు, సంజయ్‌కాలనీ, ముత్యాలమ్మ వీధి కాలనీలకు సరిపడా కృష్ణాజలాలు రాకపోవడంతో బోరు నీరు తెచ్చుకొని తాగుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హనుమాన్‌నగర్‌లో నాలుగు రోజులకు ఒక్కసారి నీటి సరఫరా అవుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలో 84 బోర్లు పని చేస్తున్నాయి. 13బావులకు మోటర్లు బిగించి నీటిని సరఫరా చేస్తున్నారు. కాని కృష్ణా జలాల సరఫరా నిలిచిపోవడంతో నీటి సమస్య నెలకొంది. మరమ్మతు నిర్వహించి కృష్ణాజలాలు సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



దేవరకొండకు మునిసిపాలిటిలో తాగునీటిని సరఫరా చేసే ట్యాంక్

మరమ్మతు పూర్తి చేసి నీటి సరఫరా చేస్తాం:

కోదండాపురం ప్లాంట్ నుంచి సరఫరా అయ్యే కృష్ణాజలాలలో అంతరాయం ఏర్పడింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్య త్వరలో పరిష్కారం అవుతుంది. అన్ని కాలనీలకు కృష్ణాజలాలు సరఫరా చేస్తాం. -రాజు, మున్సిపల్ ఏఈఈ దేవరకొండ

జన సైనికులకు భరోసా కల్పించడమే ధ్యేయం



పార్టీ సభ్యత్వ పత్రాలను అందజేస్తున్న సోషల్ మీడియా కన్వీనర్ గోవర్ధన్

అడవిదేవులపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జన సైనికులకు, వీర మహిళలకు భరోసా కల్పించడమే జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ధ్యేయమని పార్టీ ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కోట్రా గోవర్ధన్ అన్నారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి మేకల సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి గోవర్ధన్ ఆదివారం నియామకపత్రాలు అందజేసి మాట్లాడారు. పవన్ కల్యాణ్ ఆశయాల కోసం, జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న పార్టీ కార్యకర్తలకు ప్రమాదం జరిగితే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేలు, మరణిస్తే కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా అందిస్తున్నట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కనకయ్య, జానిపాషా, భార్గవ్, అనిల్, వెంకటేశ్వర్లు, శీలం సైదయ్య, బండి కొండల్, బండి నర్సయ్య, చింతల సాంబ, బండి శ్రీను, చిన్ని, మొగిలి వెంకటరమణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రామశర్మ ఆశయాలు సాధిద్దాం

● ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

దేవరకొండ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే దివంగత బొడ్డుపల్లి రామశర్మ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. రామశర్మ 8వ వర్ధంతి పురస్కరించుకొని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. దేవరకొండ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలో రామశర్మ ఒకరు అన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా పర్వత్‌రెడ్డి, ఉజ్జిని నారాయణరావుతో కలిసి ఎన్నో పోరాటాలు చేశారు. దున్నేవానికే భూమి ఇవ్వాలని, భూస్వాముల భూములను పేదలకు పంచిన ఘనత రామశర్మకే దక్కిందన్నారు. ఉద్యమ నిర్మాతగా పలు పోరాటాలు చేస్తునే ఎమ్మెల్యేగా దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశాడని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సీపీఐ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహరెడ్డి, దేవరకొండ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, నూనె రామస్వామి, వలమాల ఆంజనేయులు, సీపీఐ నాయకులు రంగారెడ్డి, కిన్నెర యాదయ్య, జ్యోతిబసు, షైనొద్దిన్, కందుకూరి శ్రీను, బ్రహ్మచారి, లక్ష్మణచారి పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే రామశర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సత్యం, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి

అపూర్వ సమ్మేళనం



సల్కునూరు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేములపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్కునూరు క్రాస్‌రోడ్డు వద్ద గల శ్రీవిద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. 30 ఏళ్ల తరువాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని నాటి బాల్య స్మృతులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి దోహదపడిన నాటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జిన్నా వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య, పరశురాములు, పూర్వ విద్యార్థులు నరేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, పుల్లయ్య, హసీనా, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకన్న, యాదగిరి, కిరణ్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, లక్ష్మీనారాయణ, గౌస్, స్వప్న, కల్యాణి, భవాని, శోభా, మంజుల, లక్ష్మి విజయ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవూర : మండలంలోని పులిచెర్ల గ్రామంలోని జడ్పీహైస్కూల్‌లో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు రామ్మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అంజయ్య, మట్టయ్య, బాలునాయక్, పుణ్యవతి, సమీమున్, విద్యార్థులు భాషపాక ఏడుకొండలు, కామిశెట్టి శంకర్, బొడ్డుపల్లి, ఆంజనేయులు, సైదులు, జాని, ఎల్లయ్య విక్రమ్, సైదులు, రవి, ముత్యాలు, వెంకట్‌రెడ్డి, జాని, అంజి పాల్గొన్నారు.



పులిచెర్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

నాగార్జునసాగర్,జూన్16(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ నియోజక వర్గంలోని జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరుతూ ఆదివారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సాగర్‌లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం జానారెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వడానికి జానారెడ్డి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

వల్లభరావు చెరువులో ఆక్రమణలే లేవట?

(5వ పేజీ తరువాయి)

అధికారులు పరిశీలించడంతో పాటు ఆక్రమణలు వాస్తవమేనని సైతం పేర్కొన్నారు. రెండు ఏళ్ల క్రితం అప్పటి నీటిపారుదలశాఖ ఏఈఈ, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు చెరువును సందర్శించి ఆక్రమణలు పెద్ద మొత్తంలో జరిగాయని, ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ జోన్‌లో ప్రీకాస్ట్ ఇటుకులతో ప్రహరీను అక్రమంగా నిర్మించారని తేల్చి సర్వే కూడా చేశారు. అనంతరం ఆక్రమణలపై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైనప్పుడు చెరువులోని నిర్మాణాలను కూల్చి హద్దులను ఏర్పాటు చేశారు. తిరిగి కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలను చేస్తున్నారు. గతంలో ఆక్రమణలు కూల్చి వేసిన అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. తిరిగి ఆక్రమణలు కొనసాగడం చూస్తుంటే కొందరు తెరవెనుక తతంగాన్ని నడిపిస్తుండటం వల్లే అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రెవెన్యూ అధికారులు మొక్కుబడి సర్వే చేసి ఎలాంటి ఆక్రమణలు జరగలేదని నివేదిక ఇచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు విమర్శలు వినవస్తున్నాయి. గతంలో ఉన్న చెరువు హద్దులు చెరువులోకి వెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువు శిఖానికి హద్దులు ఏర్పాటు చేయడంతోపాటు ఫెన్సింగ్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదలశాఖ డీఈఈ సతీష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా వల్లభరావు చెరువు ఎలాంటి ఆక్రమణలకు గురికాలేదని రెవెన్యూశాఖ నివేదిక ఇచ్చిందని తెలిపారు.

ఇంకా నివేదిక ఇవ్వలేదు

తహసీల్దార్ చెప్పిన వెంటనే సర్వే చేశా. నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిలోని హైవే సర్వే ఉండటంతో అదే రోజు వల్లభరావు చెరువు సర్వే కూడా పూర్తిచేశా. అయితే ఇంకా నివేదిక ఇవ్వలేదు. చెరువు శిఖానికి సంబంధించి 86 ఎకరాలను సర్వే చేయగా, ఎలాంటి ఆక్రమణలకు గురికాలేదు.
-సైదులు, సర్వేయర్, నల్లగొండ

ఉన్నతాధికారులకు తెలియజేశాం

వల్లభరావు చెరువులో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని సర్వేయర్ తెలిపాడు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఆర్డీవోకు కూడా వివరాలు అందించాం. నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి హద్దురాళ్లను పాతుతాం. ఇదే విషయాన్ని సంబంధితశాఖకు తెలిపాం. ఈనెల 21న జరిగే నీటిపారుదలశాఖ మీటింగ్‌లో దీనిపై నిర్ణయం తీసుకుంటాం.
హరిబాబు, తహసీల్దార్, నల్లగొండ

యువత రక్తదానానికి ముందుకు రావాలి : మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి

హాలియా,జూన్15(ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చాంరు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అమీర్‌అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు అమీర్ అలీ ఆధ్వర్యంలో తలసేమియా, సికెల్ సెల్ అనిమియా వ్యాధి పిల్లల కోసం ఏర్పాటు చేసిన మహారక్తదాన శిబిరాన్ని సామాజిక వేత్త, సినీ హీరో సోనూసూద్ అనుచరులు కందకట్ల సిద్దురెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమీర్‌అలీ చేస్తున్న పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు గమనిస్తున్నామని, వారి కార్యక్రమాలు నేటి యువతకు ఆదర్శనీయంగా ఉన్నాయన్నారు. యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి రావడం అభినందనీయమన్నారు. సిద్దురెడ్డి మాట్లాడుతూ నేటి యువతకు అమీర్ అలీ ఆదర్శనీయుడన్నారు. అనంతరం సామాజిక వేత్తలకు, రక్తదాతలకు బెస్ట్ సర్వీస్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సినీ హీరో ఇంద్రసేనా, జనయేత్రి సంస్థ చైర్మన్ డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్, వీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, యడవల్లి నరేందర్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, గౌని రాజారమేష్‌యాదవ్, మజార్ మొయినుద్దీన్, షేక్ అన్వరుద్దీన్, మహమ్మద్ బాబుద్దీన్; జానీపాషా పాల్గొన్నారు.



ప్రశాంస పత్రం అందజేస్తున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

పర్యావరణ ప్రేమికులకు ప్రత్యేక సన్మానం

మిర్యాలగూడ టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పర్యావరణ ప్రేమికులను ఘనంగా సన్మానించారు. హాలియాలో ఆదివారం జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 5.5 లక్షల విత్తనాలను సేకరించిన అవిరెండ్ల సందీప్, మిత్రబృందం ఘన సన్మానం పొందింది. ప్రముఖ సామాజిక వేత్త కందగట్ల సిద్దురెడ్డి, సినీనటుడు ఇంద్ర, ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మునీర్ అహ్మద్ చేతులమీదుగా సన్మాన కార్యక్రమం జరిగినట్లు సందీప్ తెలిపారు.

● పట్టణానికి చెందిన ఉబ్బపల్లి రాజు ఇదే వేదికపై రక్తదాత సుఖీభవ అవార్డు అందుకున్నాడు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం, రక్తదానంపై విస్తృత ప్రచారం అందించడంతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాజు అవార్డు అందుకున్నారు. కార్యక్రమాలలో అమీర్‌అలీ, ధైద శ్రీనివాస్, నందిపాటి నరేష్, కిరణ్, పవన్, మణి, అవినాష్, రాజశేఖర్, రూహిద్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ చెన్నంనేనిపల్లి గ్రామ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంనేనిపల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఆదివారం మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్యమాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం మండల ఇన్‌చార్జి పోలేని యాదయ్యమాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పోరాటాలు, త్యాగాలను గుర్తు చేశారు. జూలై 7న నిర్వహించేఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా గ్రామగ్రామానా జెండావిష్కరణ నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాగా గ్రామ శాఖ అధ్యక్షులుగా నిరసనమెట్ల రామకృష్ణమాదిగ, ప్రధాన కార్యదర్శిగా సైదులు మాదిగ, ఉపాధ్యక్షుడిగా రాం బాబు, కార్యదర్శిగా భిక్షమయ్య, అధికార ప్రతినిధిగా విష్ణుమాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీరాములుమాదిగ, అంజి, గణేష్, శేఖర్‌మాదిగ, సుమన్, జైహింద్ తదితరులు పాల్గొన్నారు.